## తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ధ్యానచంద్ర బాధ్యతలు స్వీకరణ



తిరుపతి కార్పొరేషన్, మార్చి 16, ప్రభాతవార్త

తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా నేటి శనివారం ధ్యానచంద్ర హెచ్‌ఎం జిల్లా కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఎస్డిసి భాస్కర్ నాయుడు, ఆర్డిఓ సూళ్లూరుపేట చంద్రముని పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎఓ నరసింహా రావు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు నూతన జెసికి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టరేట్‌లో పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర




## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

తిరుపతి కార్పొరేషన్, మార్చి 16, ప్రభాతవార్త



అమరజీవి పొట్టి శ్రీరాములు వారి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని బిసి సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఆర్ఓ హాజరై పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ పెంచల కిషోర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలమే మన తెలుగు రాష్ట్రం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ జయరాములు, బిసి సంక్షేమ శాఖ అధికారులు జ్యోత్స్న, బిసి హాస్టల్ వెల్ఫేర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యులే...అభ్యర్థులు..!

**ఒకే జాబితాలో వై.కా.పా సైన్యం సిద్ధం**

**అసమ్మతులను పట్టించుకోని అధిష్టానం**



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (పుంగనూరు), రోజా (నగరి), రాంకుమార్‌రెడ్డి (వెంకటగిరి), బియ్యపు మధుసూదన్‌రెడ్డి (శ్రీకాళహస్తి), కిలివేటి సంజీవయ్య(సూళ్లూరుపేట), భరత్ (కుప్పం), సునీల్‌కుమార్ (పూతలపట్టు), వెంకటగౌడ (పలమనేరు), మేరుగ నాగార్జున ( గూడూరు),



అభినయ్‌రెడ్డి (తిరుపతి), మోహిత్‌రెడ్డి (చంద్రగిరి), రాజేష్ (సత్యవేడు), విజయానందరెడ్డి (చిత్తూరు), కృపాలక్ష్మి (జిడినెల్లూరు)

*అందరూ ఊహించినట్టే జరిగింది.మార్పులు జరగాలని,లేకుంటే తాము సహక రించమని పట్టుబడ్డ అసమ్మతి గళాలను అధిష్టానం పట్టించుకోలేదు. నిన్నటి దాకా ఎమ్మెల్యేలుగా,నియోజకవర్గ బాధ్యులుగా వున్నవారికే వై.కా.పా అధిష్టానం టిక్కెట్లు కేటాయిస్తూశనివారం జాబితావిడుదల చేసింది. శనివారం వై.ఎస్.ఆర్ జిల్లా ఇడుపులపాయలో ముఖ్యమంత్రి,వైకాపా అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో రాష్ట్రమంత్రి ధర్మాన ప్రసాద్‌రావు 174 మంది ఎమ్మెల్యేల జాబితాను ప్రక టించగా,బాపట్ల ఎం.పి నందిగం సురేష్ 25 మంది ఎంపిల జాబితాను ప్రక టించారు.*

( ప్రభాతవార్త నెట్‌వర్క్ -తిరుపతి,చిత్తూరు)

తిరుపతి జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో తిరుపతి నుంచి ప్రస్తుత శాసనసభ్యుడు భూమన కరుణాకరరెడ్డి తనయుడు భూమన అభినయరెడ్డిపేరును ప్రకటించగా,చంద్రగిరి నుంచి ప్రస్తుత శాసనసభ్యుడు చెవిరెడ్డిభాస్కర్‌రెడ్డి తన యుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అభ్యర్థిగాప్రకటించారు.శ్రీకాళహస్తి నుంచి ప్రస్తుత శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డికే మరోమారుఅవకాశం కల్పించారు. గూడురు నుంచి ప్రస్తుత శాసనసభ్యుడు వరప్రసాద్‌రావును తప్పించి ఎమ్మెల్సీ మేరుగ నాగార్జునను అభ్యర్థిగా ప్రకటించారు.సూళ్ళూరుపేట అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యమరోమారుఅవకాశం దక్కించుకున్నారు.ఇక వెంకటగిరి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా వున్న సీనియర్ నేత,మాజీ మంత్రి ఆనంరామనారాయణ రెడ్డి వైకాపాఅధిష్ఠానంపై తిరుగుబావుటా ఎగురవేయడంతో ఆయ నను తప్పించి ఆయన స్థానంలో వెంకటగిరి బాధ్యుడిగా మాజీ ముఖ్య మంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డితనయుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిని నియమించిన వైకాపా అధిష్ఠానంఆయనకే వెంకటగిరి అభ్యర్థిగా అవకాశం ఇచ్చింది.ఇక సత్యవేడు ప్రస్తుత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రభుత్వంలో తనపట్ల జరుగు తున్న అణచివేతపై తిరగబడటంతోపాటు, పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం లో చేరడం తోపాటు ఆ పార్టీ టిక్కెట్ తెచ్చుకోవడంతో ఆయన స్థానంలో నూకతోటి రాజేష్‌ను ఇక్కడ అభ్యర్థిగా వైకాపా ప్రకటించింది. తిరుపతి ఎం.పి అభ్యర్థిగా ప్రస్తుత ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తికే మరోసారి అవకాశం ఇచ్చింది.

చిత్తూరు జిల్లా విషయానికి వస్తే చిత్తూరు ఎంపి స్థానానికి సిట్టింగ్ ఎంపి ఎన్.రెడ్డెప్పను మరోమారుఅభ్యర్థిగా ప్రకటించారు.చిత్తూరు జిల్లాలోని ఏడు స్థానా లలో మూడు కీలకస్థానాలున్నాయి.వీటిలో పుంగనూరు నుంచి సీనియర్ నేత, అటుపార్టీలో,ఇటు ప్రభుత్వంలో కీలకస్థానంలో వున్నమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి మళ్ళీ పోటీచేయనున్నారు. గంగాధరనెల్లూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి స్థానంలో ఆయన కుమార్తె కళ త్తూరు కృపాలక్ష్మి టిక్కెట్‌దక్కించుకున్నారు. ఫైర్‌బ్రాండ్‌గా పేరుతెచ్చుకున్న మరో మంత్రి ఆర్.కె.రోజా నగరి నుంచి మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు.ఆమెకు టిక్కెట్ ఇవ్వరాదని నగరి నియోజక వర్గంలోని ప్రతి మండ లంలోని కొందరు ప్రముఖ నాయకులు ఖరాకండిగా చెప్పినా అధిష్ఠానం వారి మాటలను పక్కనపెట్టిరోజాకే మరోమారు అవకాశం ఇచ్చారు.ఇక పూతల పట్టు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబును పక్కనపెట్టిన అధిష్ఠానం ఆయన స్థానంలో మాజీఎమ్మెల్యే డాక్టర్‌సునీల్‌కుమార్‌ను బరిలో దింపింది. జిల్లా కేంద్రం చిత్తూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆరణిశ్రీనివాసులు స్థానంలో ఇటీవల కాలంలో ఎం.సి.విజయానందరెడ్డిని నియోజకవర్గంబాధ్యుడిగా ప్రకటించిన అధిష్ఠా నం ఆయననే అభ్యర్థిగా ఖరారుచేసింది.వైకాపా తీరునచ్చక ఆ పార్టీని వీడిన ఆరణిశ్రీనివాసులు ఇటీవలే జనసేనలోచేరి తిరుపతినుంచి అభ్యర్థిగా అవ కాశం కోసం ఎదురుచూస్తున్నారు.ఇక మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై పోటీకి ఎమ్మెల్సీ కె.ఆర్.జెభరత్‌ను అధిష్ఠానంసిద్ధంచేసింది. ఇదిలా వుండగా జాబితాలో మార్పులువుంటాయని, కొత్తమొహాలు రంగంలోకి వస్తాయని, ప్రస్తుత ఎమ్మెల్యేలతో,నియోజకవర్గ బాధ్యులతో ఇబ్బందులు పడుతున్న కొందరు ద్వితీయశ్రేణి నాయకులకు, కార్యకర్తలకునిరాశే మిగిలింది.వారి గోడును పట్టించుకోని అధిష్టానం తాము నిర్ణయించిన అభ్యర్థికోసం పనిచేయాల్సిందే అని ఖరాకండిగా చెబుతుండటంతో అసమ్మతిరాగం ఆలపిస్తున్న కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు,కార్యకర్తలుఏమిచేయాలోతెలియనిఅయోమయంలో పడ్డారు. ముఖ్యం గా నగరినుంచి రోజా అభ్యర్థిత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకించిన శ్రీశైలం ట్రస్టుబోర్డు ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు భాస్కర్‌రెడ్డి, జడ్పీటిసి సభ్యు రాలు మల్లీశ్వరి (నింద్రమండలం) జడ్పీటిసి సభ్యుడుమురళీధర్‌రెడ్డి (వడమాలపేట) మాజీఎంపిపిడి.ఎన్.ఏళుమలై(పుత్తూరు)కె.జె.శాంతి, కె.జె. కుమార్ (నగరి) లక్ష్మీపతి రాజు(విజయపురం)అభ్యర్థనలనుఅధిష్టానం పెద్దగా పట్టించుకోలేదని తెలుస్తోంది. అలాగే వెంకటగిరి నియోజకవర్గంలో ఇటీవల కాలందాకా సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డితో సన్నిహితంగా వున్న నాయకులు నేదురుమల్లి రాంకుమా ర్‌రెడ్డి పోకడలు నచ్చక అభ్యర్థిగా మరొకరికి అవకాశం ఇవ్వాలని కోరారు. వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పెంచలకోనదేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, మాజీ సొసైటీ ఛైర్మన్ చెన్ను భాస్కర్ రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ చిగురుపాటి ప్రసన్న,ఎంపిపి కుమ్మరిగుంట ప్రసన్న,కోఆప్షన్ సయ్యద్, బాలాయపల్లి నాయకులు మాజీ ఏఎంసిఛైర్మన్ భాస్కర్‌రావు,గోపిరెడ్డి,వెంకటగిరిరూరల్ నేతటి.శివారెడ్డి తదితరులు శుక్రవారం తిరుపతి విమానాశ్రయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆశ్రయించి అభ్యర్థిని మార్చాలని కోరగా,ఒకరోజు సమయం ఇస్తే అధిష్ఠానం దృష్టికి సమస్య తీసుకువెళతానని ఆయన వారికి హామీ ఇచ్చినా అధిష్ఠానం ఆయనవైపే మొగ్గుచూపింది.నగరి అసమ్మతి నేతలు కూడా పెద్దిరెడ్డిపైనా కొండం త ఆశలు పెట్టుకోగా వారి ఆశలు కూడా నిరాశగా మిగిలాయి.తిరుపతి చిత్తూరు జిల్లాలలో మొత్తం 14 స్థానాలకు గాను ఐదు రిజర్వుడ్ నియోజకవర్గాలలోనూ ఎస్సీ మాలసామాజిక వర్గం వారికే టిక్కెట్లు కేటాయించారు.పలమనేరులో బి.సి సామాజిక వర్గానికిచెందిన వెంకటేగౌడ్‌కు,కుప్పం నుంచి వన్నెకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన భరత్‌కు కేటాయించగా తక్కిన ఏడు స్థానాలను రెడ్డిసామాజిక వర్గానికి అధిష్ఠానం కేటాయించింది.

## ఉత్సవమూర్తులకు షోడషాభిషేకాలు

### -ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



అలంకార మండపంలో ఉత్సవర్లకు అభిషేకాలు జరుపుతున్న దృశ్యం, పూజల్లో పాల్గొన్న ఆలయ ఛైర్మన్, ఇఓ, తదితరులు

శ్రీకాళహస్తి,మార్చి 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13 రోజుల పాటు నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో గ్రామోత్సవంలో పాల్గొన్న స్వామి అమ్మవార్ల ఉత్సవర్లతో పాటు పంచమూర్తులు,చంద్రశేఖర త్రిశూలంకు షోడషాభిషేకాలు నిర్వహించారు.ఆలయంలోని అలంకార మండపంలో శాస్త్రోక్తంగా ధార్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు, ఆలయ ఇఓ దంపతులు ఎస్‌వి నాగేశ్వరరావు దంపతులు హాజరు అయి సంకల్పం చేసారు. అలంకార మండపంలోని పంచమూర్తులకు ఆలయ అలంకార గురుకుల్, రాజేష్ గురుకుల్, సూరి గురుకుల్ ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేద మంత్రాలనుచదువుతుండగా ఆలయ అభిషేక ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్,అచ్చితా స్వామి గురుకకుల్ పూజలు జరిపారు. ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, సూరిగురుకుల్, శ్రీనివాసులు గురుకుల్, దక్షిణమూర్తి స్థానిక సంప్రదాయం ప్రకారం షోడషాభిషేకాలు జరిపి శాంతి చేకూర్చారు. శాంతి అభిషేకంతో ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసాయి.ఏర్పాట్లను ఆలయ ఎఇఓ ధనపాల్, సతీష్‌మాలిక్ లోకేష్ రెడ్డి సారథ్యంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం సూపరింటెండెంట్ నాగభూషణంలు పర్యవేక్షించారు.

## ఎన్‌హెచ్ పనుల విస్తరణకు రూ. 1346.81 కోట్లు మంజూరు

### ఫలించిన మంత్రి రోజా కృషి

పుత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త :



నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న రోజా (ఫైల్‌పోటో)

తమిళనాడు రాష్ట్ర సరిహద్దు నుంచి నగరి మీదుగా పుత్తూరు వరకూ 716 జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం కేంద్ర ఉపరితల రవాణా శాఖ శనివారం రూ. 1346.81 కోట్లను మంజూరు చేసింది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఈ పనుల కోసం గతంలో ఢిల్లీలోనూ, విజయవాడ, తిరుపతి పట్టణాల్లో స్వయంగా ఉపరితల రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. తమిళనాడులో వుంటే తిరుత్తణి నుంచి ఆంధ్రలో వుండే తిరుపతి వరకూ వున్న జాతీయ రహదారి పనులు అసంపూర్తిగా వున్నాయని తెలిపారు. తిరుత్తణి - తిరుపతి ఈ రెండు పుణ్యక్షేత్రాల నడుమ రాకపోకలు ఎక్కువగా వుంటాయని, ప్రయాణీకులు, భక్తులు రోడ్డు పనులు అసంపూర్తిగా వున్నందున తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. ఆ మేరకు గతేడాది నగరి నియోజకవర్గం పరిధిలోకి వచ్చే వడమాలపేట, పుత్తూరు మండలాల్లో అసంపూర్తిగా వున్న రహదారి పనులు ప్రారంభించారు. అవి దాదాపుగా పూర్తి కానున్నాయి. అలాగే పుత్తూరు పట్టణం నుంచి నగరి మీదుగా తమిళనాడు సరిహద్దు వరకూ 20.03 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరణ పనులకు నిధులను మంజూరు చేశారు. తన అభ్యర్థన మేరకు స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి రోజా కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి

చిత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త:

జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో శనివారం ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరణ నిరాహారదీక్ష చేసి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రా ఏర్పాటుకు ఆద్యుడుగా పొట్టి శ్రీరాములు నిలిచారన్నారు. గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన పొట్టి శ్రీరాములు దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారన్నారు. క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహ ఉద్యమాల్లో పొట్టి శ్రీరాములు పాల్గొని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారన్నారు.

## టిడిపికి వేనాటి గుడ్‌బై

### మర్యాద లేనిచోట ఉండలేను

### మాపై రాజకీయ కుట్ర జరుగుతోంది - వేనాటి రామచంద్రారెడ్డి

సూళ్లూరుపేట, మార్చి 16 ప్రభాతవార్త



సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వెన్నుదన్నుగా ఉంటూ పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న టిటిడి బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి తన సుదీర్ఘ తెలుగుదేశం పార్టీ అనుబంధానికి గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించారు. శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. వేనాటి కుటుంబం టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయులుగా సేవ చేస్తూ ఉన్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు తనను ఎంతో బాధించాయని రామచంద్రారెడ్డి తెలిపారు. పార్టీకి సంబంధించి అభ్యర్థిని ఎంపిక చేసిన తర్వాత కూడా తమకు మాటమాత్రంగా కూడా చెప్పకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబునాయుడంటే తనకెంతో గౌరవమని, ఆయనకు తనమీద కూడా ఎంతో ప్రేమ ఉందని, కానీ ఈ మధ్యలో ఏమి జరిగిందో తనకు తెలియదన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే చంద్రబాబుకు, తనకు మధ్య దూరం పెంచేలా చేశారని రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించడంతో రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు





శ్రీకాళహస్తిలో రాజకీయనాయకులు విగ్రహాలకు ముసుగులు వేసిన దృశ్యం,
విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్‌లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వస్త్రం కప్పి ఉంచిన సిబ్బంది

## గ్రూప్-1 పరీక్షలకు సర్వం సిద్ధం

**- నేటి పరీక్షలకు 2,517 మంది అభ్యర్థులు**

**- సందేహాల నివృత్తి కోసం 94910 77356తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

**- కలెక్టర్ సగిలి షన్మోహన్**

చిత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త:

జిల్లాలో ఆదివారం జరుగనున్న గ్రూప్-1 పరీక్షల పక్కా నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాటు చేపట్టి పూర్తి చేసినట్లు కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం 2,517 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షలకు హాజరు కానున్నారని, వీరికి చిత్తూరు ఆర్‌విఎస్ నగర్‌లోని ఎస్వీ సెట్, చిత్తూరు సీతమ్స్ కళాశాల, చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి పేపర్-1 ఉదయం 10-12 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2-4 గంటల వరకు జరుగుతుందన్నారు. పేపర్-1 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9 నుండి 9.45 గంటల్లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పేపర్-2 పరీక్షలు మధ్యాహ్నం 1 నుండి 1.45 గంటల్లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు ఒక్క క్షణం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదైనా సందేహాలు వుంటే అభ్యర్థులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం: 94910 77356ను సంప్రదించాలన్నారు.

## గ్రూప్ 1 పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్

తిరుపతి క్రైం, మార్చి 16, ప్రభాతవార్త



ఎపిపిఎస్సీ గ్రూప్ 1 ఫిలిమ్స్ పరీక్షల నిర్వహణ పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వారితో వర్చువల్ పద్ధతిలో జూమ్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పాటించాల్సిన కార్యాచరణను వివరించారు. తిరుపతి జిల్లా నుండి ఎస్పి కృష్ణకాంత్ పటేల్ స్థానిక కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద జరగబోయే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల నిర్వహణకు నలుగురు అదనపు ఎస్పిలు, ఆరు మంది డిఎస్పిలు, 14 మంది సిఐలతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## నల్లబెల్లం, నాటుసారా స్వాధీనం

పెద్దపంజాణి మార్చి16 ప్రభాతవార్త :

పెద్దపంజాణి మండలంలో అక్రమంగా జరుగుతున్న నాటుసారా తయారీపై పోలీసులు ఉక్కుపాదం మోపారు.శనివారం దాడులు నిర్వహించి సుమారు 1.53లక్షలు విలువచేసే నల్లబెల్లం,నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ క్రిష్ణమోహన్ తెలిపారు.మండలంలోని రాయలపేట పంచాయతీ చిలక పుత్తూరు గ్రామ సమీపంలో ఓ దుకాణగదిలో నల్లబెల్లం,నాటుసారా నిల్వఉంచారని సమాచారం అందిందన్నారు.ఈ మేరకు గ్రామస్థులను విచారించగా నాటుసార తయారీకి అక్రమంగా వినియోగించే నల్లబెల్లం,నాటుసారా విక్రయదారుడి ఆచూకి తెలిసిందన్నారు.రాయలపేట గ్రామానికి చెందిన మల్లికార్జున (56) అనేవ్యక్తి నాటుసారా తయారీ చేసేందుకు అక్రమంగా 3వేల కిలోల నల్లబెల్లం,10లీటర్ల నాటు సారాను నిల్వవుంచుకున్నాడని తెలిపారు.మల్లికార్జునకు చెందిన దుకాణంలో తనికీలు చేయగా మెత్తం రూ.1.53లక్షల విలువచేసే నల్లబెల్లం,మూడువేల రూపాయలు విలువచేసే నాటుసారా పట్టుబడిందన్నారు.ముద్దాయిపై ఇదివరకే పంజాణి పోలీస్‌స్టేషన్లో కేసుసైతం నమోదై ఉందన్నారు. నాటుసారా,నల్లబెల్లం అక్రమ నిల్వలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని గముకొండ పాళ్యం వద్ద మరో20లీటర్ల నాటుసారాను విక్రయిస్తున్న నిందుతుడు వై.రాజన్న(55) అనే వ్యక్తిని పట్టుకొని అరెస్టుచేసినట్లు తెలిపారు,ఈ కార్యక్రమంలో ఎస్సై టి.శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

## అసంతృప్తులను బుజ్జగించేదెలా!?

**-"ఆరణి"వ్యతిరేకతను సానుకూలంగా మలచుకోగలడా??**

ప్రభాతవార్త-తిరుపతి:



తిరుపతి నియోజకవర్గంలో తెలుగుదేశం,బిజెపి,జనసేన పార్టీల ఉమ్మడి అభ్య ర్థిగా జరగనున్న ఎన్నికల్లో పోటీకి దిగుతున్న ఆరణి శ్రీనివాసులు ఇక్కడ అసంతృ ప్తులను బుజ్జగించి...తనవైపు తిప్పుకోగలరా!?అనే సందేహాలుసొంత పార్టీల నేత ల్లోనే వ్యక్తమ వుతున్నాయి. తిరుపతిలో పార్టీ జెండాలు మోసి, కష్టకాలంలోనూ అండగా నిలబడిన స్థానిక నేతలను కాదని బయటిప్రాంతం చిత్తూరుకు చెందిన ...వైసిపి నుండి జనసేనకు పార్టీ మారిన నేత ఆరణికి తిరుపతి టిక్కెట్ ఇవ్వడాన్ని టిడిపి,జనసేన పార్టీల నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ దరిమిలా ఇంటిపోరు తప్పదన్నట్లు ఆరణికి తొలినుంచి వ్యతిరేకత వ్యక్తమవు తోంది.జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ టిడిపితో పొత్తుల్లో భాగంగా తిరుపతి పై ఫోకస్ పెట్టారు. ఇక్కడ తమ పార్టీ అభ్యర్థిగా నిఖార్సయిన నాయకుడు లేకపోవడంతో చిత్తూరునుండి దిగుమతి చేసుకుని ఆరణి శ్రీనివాసులుకు టిక్కెట్ ఇచ్చాడు. అయితే ఆయన పట్ల స్థానికంగా ఉన్న నాయకులు అం దరూ గుస్సాతో ఉన్నారు. తిరుపతి స్థానంపై తొలినుండి టిడిపి తరపున సుగుణమ్మ, నరసింహయాదవ్, జెబి శ్రీనివాసులు, ఊకా విజయకుమార్‌తో బాటు చివరకు డాక్టర్ కోడూరు బాల సుబ్రమణ్యం కూడా ఆసక్తి చూపారు. అయితే తిరుపతి రాజకీయ విబేధాల నేపథ్యంలో జనసేన పార్టీకి కేటాయిం చారు. ఇప్పుడు అంతటా వ్యతిరేకత నెలకొనడంతో ఆరణి టిడిపి, జనసేనలోని సొంత కులానికి చెందిన నేతల మనస్సులు గెలుచుకోగలరా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆయన తీరు మార్చుకోకుంటే మరోపార్టీ అభ్యర్థి గెలుపుకు సహాయపడినట్లేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నసమయంలో ప్రభుత్వంలో చక్రం తిప్పి డబ్బు,హోదా సంపాదించుకున్న జిల్లాలోని కొందరు నేతలు 2019లో పార్టీ ఓడిపోగానే ముఖంచాటేసి సొంత వ్యాపారాలుచేసుకుంటున్నారని విమర్శలు లేకపోలేదు. అలాంటి వారు కొందరు ఇప్పుడు మరోపార్టీవైపు చూస్తున్నారని కార్యకర్తలు విరుచుకుపడుతూన్నారు. చంద్రబాబు సొంత జిల్లాలో ఇలాంటివాళ్ళు ఎక్కువగా ఉన్నారని, అవకాశవాదులను,పార్టీకోసం ధీటుగా పనిచేయని నేతలను పక్కన పెట్టి పనిచేసే వారిని ప్రోత్సహిస్తే తప్ప ఎన్నికలను సవాల్‌గా తీసుకుని పనిచేయ లేరని బాహాటంగా విమర్శలుగుప్పిస్తున్నారు. మరీ ఎన్నికల ప్రచారం మొదలు పెట్టి, బిఫారమ్ చేతికి అందేనాటికి ఆరణి పరిస్థితి చెవిలోన జోరీగ లాగా మారు తుందేమోనని సర్వత్రా చర్చమొదలైంది.

## టిడిపిలోకి 20 కుటుంబాల చేరిక

**వి.కోట,మార్చి 16,ప్రభాతవార్త:**మండలంలోని చింతమాకుల పల్లె పంచాయితీలో సుమారు 20 కుటుంబాలు మాజీ మంత్రి అమరనా థరెడ్డి అధ్వర్యంలో శనివారం టిడిపిలో చేరారు. మండల పార్టీ అధ్యక్షులు రంగ నాథ్,సీనియర్ నాయకు లు రామచంద్ర నాయుడు,ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ గౌడ్,సీనియర్ నాయకకులు రాంబాబు.ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా వాసుదేవరెడ్డి

**కుప్పం, మార్చి 16 ప్రభాతవార్త** కుప్పం ఎంఎఫ్‌సి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిని ్సపాల్‌గా వాసుదేవరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదివరకు చిత్తూరులోని ఒకేషనల్ కాలేజ్‌లో అధ్యాపకుడిగా పనిచేస్తూ పదోన్నతిపై కుప్పంకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్‌ను పూర్వ ప్రిన్సిపాల్ సరిత, ఒకేష నల్ ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, అధ్యాపకులు ధరణి, జగదీష్‌బాబు సత్కరించారు.

## ఇచ్చిన హామీల అమలు ఘనత సిఎం జగన్‌దే

**– ఎమ్మెల్సీ ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్**



శాంతిపురం, మార్చి 16 ప్రభాతవార్త

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సిఎం జగనన్నకే దక్కుతుందని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. శనివారం రాళ్ల బూదుగూరులో 40వేల లీటర్ల నూతన ట్యాంకు, రైతు భరోసా కేంద్రం, పిల్లిగానిపల్లి గ్రామానికి నూతన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, కో ఆప్షన్‌నిసార్,సర్పంచ్‌లక్ష్మి,కన్వీనర్‌దండపాణి, ఎంపిటిసి లక్ష్మిరమేష్, మంజునాథ్, నియాజ్ పాల్గొన్నారు.

## టిఎన్‌యుఎస్ కార్యవర్గం ఎన్నిక



కుప్పంరూరల్, మార్చి 16 ప్రభాతవార్త

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రజనీబాబునాయుడు, జిల్లా అధ్యక్షుడు మధుసూధన్‌తెలిపారు. కుప్పం మండల అధ్యక్షు డిగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా సురేష్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, కార్యదర్శులుగా వెంకటేష్, సురేష్‌బాబును ఎన్నుకున్నారు.

## బదిలీ అయిన పోలీసులకు సత్కారం

**పెద్దపంజాణి మార్చి16 ప్రభాతవార్త :** పెద్దపంజాణి పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న జయచంద్ర,రాజు,శ్రీనివాసులుజిల్లాఉన్నతాధికారుల ఆదేశాలమేరకు రామకుప్పం,గుడిపల్లి పోలీస్ స్టేషన్లకు బదిలీఅయ్యారు.వీరినిఎస్సై టి.శ్రీనివాసులు,సిబ్బందిఘనంగాసత్కరించారు.సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి - అభివృద్ధి చేస్తా

**కార్వేటినగరం,మార్చి 16 ప్రభాతవార్త:**ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వండి నియోజకవర్గాన్ని మంచిగా అభివృద్ధి చేస్తామని దేశం అభ్యర్థి డాక్టర్ థామస్ తెలిపారు. కార్వేటినగరం మండలంలో శనివారం గాజులకండ్రిగ,సుద్దగుంట,రాజులకండ్రిగ గ్రామాల్లో భవిష్యత్తు గ్యారింటీ–బాబు ష్యూరిటీ కార్యక్రమంలో భాగంగా థామస్ ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి యుగంధర్ పొన్నా, మండల అధ్యక్షులు చెంగల్‌రాయల్ యాదవ్,బిసిసెల్ అధ్యక్షులు రవియాదవ్,మాజీ వైస్ ఎంపిపి రవికుమార్,మాజీ డియల్‌డిఎ ఛైర్మన్ అక్కల తిరుమలనాథ్,మైనారిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సందాని, దామోదరం,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి రాక్షస పాలన నుంచి విముక్తి

**– కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం**

**కుప్పం, మార్చి 16 ప్రభాతవార్త** రాష్ట్రానికి సిఎం జగన్ రాక్షస పాలన నుంచి విముక్తి లభించిందని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మున్సిపల్, మండల టిడిపి అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, నేతలు రవి, కెవి శ్రీనివాసులు, వేణు, రవినాయక్, రమేష్, బాలు, నాయుడు, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

***గతం గుర్తు చేసుకుని చంద్రబాబు రుణం తీర్చుకోండి***

కుప్పం రూరల్ : కుప్పానికి మాజీ సిఎం చంద్రబాబు చేసిన మేలు గుర్తు చేసుకుని వచ్చే ఎన్నికల్లో కుప్పం ప్రజలు చంద్రబాబు రుణం తీర్చుకోవాలని టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం కోరారు. శనివారం వానగుట్టపల్లి, వేపూరు గ్రామంలోని ఆలయాల్లో పూజలు చేసిన అనంతరం ఆయన గతం గుర్తు చేసుకుందాం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నేతలు మహేంద్ర, ఎవి రవి, శివకుమార్, లీలా వెంకటేష్, మంజు, వసంతమ్మ, స్వాతి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

**శాంతిపురం, మార్చి 16 ప్రభాతవార్త** తెదేపా అధినేత చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మండలంలోని నడింపల్లిలో వారు ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్, చలపతి, మణి, గోపాల్, నాగరాజు, రమేష్, గోవిందరాజులు, అనసూయ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పోలీసు బదిలీలు తక్షణం నిలిపేయాలి

**– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్**

**కుప్పం, మార్చి 16 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లాలో ఈనెల 14వతేది చేపట్టిన పోలీసు శాఖ బదిలీలను తక్షణం నిలుపుదల చేయాలని ఎమ్మెల్సీ, కుప్పం తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ బదిలీలు రానున్న ఎన్నికలను ప్రభావితం చేయడానికి అధికార పార్టీకి అనుకూలురైన అధికారులను జిల్లా ఎస్పీ బదిలీ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజల ప్రజాస్వామిక హక్కులు కాపాడేందుకు ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా తెదేపా కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## పిఇఎస్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదాలపై అవగాహన

**కుప్పం, మార్చి 16 ప్రభాతవార్త** కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో శనివారం అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫైర్ అధికారి ఆర్ముగం నాయర్ అగ్నిప్రమాదాలు సంభవించిన సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నష్ట నివారణ చర్యల గురించి సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత వైకాపా నేతలకు లేదు

**– తెదేపా వడ్డెర సంఘ నేతలు**

**కుప్పంరూరల్, మార్చి 16 ప్రభాతవార్త** తెదేపా అధినేత చంద్రబాబునాయుడు గురించి మాట్లాడే అర్హత కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న, వైకాపా నేతలకు లేదని తెదేపా వడ్డెర విభాగం జిల్లా, కుప ్పం నేతలు మాధవన్, రవి, వెంకటేష్, బాలు తదితరులు పేర్కొన్నారు. శనివారం కుప్పం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుట్టపర్తిలో వడ్డే వెంకట్‌కు చంద్రబాబు అసెంబ్లీ సీటు ఇవ్వలేదని గగ్గోలు పెట్టడం తగదన్నారు. ఆయనకు చంద్రబాబు ఎమ్మెల్సీ పదవి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 2019లోనే చంద్రబాబు కుప్పంలో వడ్డెరలకు 2.35ఎకరాల స్థలం, 25లక్షల నిధులు సైతం మంజూరు చేశారన్నారు. సమావేశంలో సంఘ నేతలు చెంగప్ప, సుబ్రమణ్యం, బేటప్ప, భానుమూర్తి, రోహిత్‌కుమార్, మురుగయ్య, రవి పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 18మంది ఎంపిక

**కుప్పంరూరల్, మార్చి 16 ప్రభాతవార్త** కుప్పం లయన్స్ క్లబ్, పిఇఎస్ వైద్య కళాశాల ఆస్పత్రి అధ్వర్యంలో కుప్పం పిఇఎస్ అర్బన్ కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 120మందికి వైద్యులు క ంటి పరీక్షలు జరిపి ఉచిత ఆపరేషన్లకు 18మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ డా॥ మహేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, సభ్యులు చరణ్, డా॥ కృష్ణమూర్తి, చంద్రశేఖర్, పిఆర్వో అంజి పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి

కోట, మార్చి 16 ప్రభాతవార్త

శ్రీపొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా శనివారం కోటలోని ఉపాధ్యాయులు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆయన స్ఫూర్తితో దేశంలో ఎన్నో సరికొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు మస్తానయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు విన్నమాల శ్రీనివాసులు, నాగరాజు, లక్ష్మణ్, నందా తదితరులు పాల్గొన్నారు.

## 7రోజుల పాటు ధ్యాన మహాయజ్ఞం

చిత్తూరురూరల్, మార్చి 16 ప్రభాతవార్త:

కాణిపాకం సమీపంలో వెలసిన శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహా శక్తి క్షేత్రంలో ఈనెల 18వ తేది నుంచి 24 వరకు ధ్యాన మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.బి.గోపాలక్రిష్ణమూర్తి తెలిపారు. ప్రతిరోజు సంగీతధ్యానం, మౌనధ్యానం, స్వాధ్యాయం, సజ్జనసాంగత్యం, ఆత్మజ్ఞానబోధన, ధ్యానప్రచారం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, ఉచిత వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా 63కేసుల పరిష్కారం



**పుంగనూరు,మార్చి 16 ప్రభాతవార్త :** పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 63 కేసులు పరిష్కారమయ్యాని సీనియర్ సివిల్‌జడ్జి కె.వాసుదేవరావు తెలిపారు. ఉదయం నుంచి వచ్చిన వివిధ సివిల్,క్రిమినల్ కేసులను ఆయా కక్షిదారులతో చర్చించి వారిని సహేతుకమైన రాజీమార్గంలో కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా రెండు వర్గాల వారు న్యాయసమ్మతమైన రాజీలు కుదుర్చుకున్నారని వివరించారు. ఇందులో భాగంగా జూనియర్ సివిల్ జడ్జి జి.కార్తీక్,మరియు బార్ సభ్యులు,సీనియర్ న్యాయవాదులు లోక్ అదాలత్ సభ్యులుగా ఉంచి కేసులను పరిష్కరించారు. ఈకేసుల పరిష్కారం ద్వారా రూ.72.15లక్షల విలువైన రాజీలు కుదిరాయన్నారు. కార్యక్రమాలలో న్యాయవాదులు,కక్షిదారులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎన్నికల నియమావళిని అతిక్రమించరాదు

చౌడేపల్లి, మార్చి 16 ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికల కోడ్ ప్రారంభమైనందున పట్టణంలో నియమావళిని పాటించాలని కార్యదర్శి సుధాకర్ అన్నారు. పట్టణంలోని రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు, గోడపత్రికలు, చేతిరాతలు తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఎలక్షన్ కమీషన్ నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ సిబ్బందిచే పట్టణంలోని వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, గోడపత్రికలు తొలగించబడ్డాయి.

## రాజనాలబండపై శనివారం పూజలు

రాజనాలబండ(చౌడేపల్లి), మార్చి 16 ప్రభాతవార్త

సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాబండపై శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఉదయాన్నే ప్రసన్న ఆంజనేయస్వామి, శ్రీలక్ష్మీసమేత నరసింహస్వామికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో రాజనాలబండ కిటకిటలాడింది. పలువురు అనుమానితులు ప్రమాణాలు చేయగా, మరికొందరు వాయిదా వేసుకొని వెళ్ళారు. టిటిడి టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ భానుప్రకాష్, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి

చిత్తూరురూరల్, మార్చి 16 ప్రభాతవార్త:

చిత్తూరు పట్టణం, గంగినేనిచెరువు వద్ద వున్న అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి వాసవి క్లబ్ గ్రేటర్ చిత్తూరు అధ్యక్షులు గోవర్ధన్ ఆద్వర్యంలో అన్ని సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన రాష్ట్ర ప్రజలకు చేసిన త్యాగాలను స్మరించుకొంటూ భావితరాలవారు ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గోవర్ధన్‌తో పాటు వాసవిక్లబ్ చిత్తూరు గ్రేటర్ రీజనల్ ఛైర్మెన్ ఓఆర్ నాగేంద్ర, జోన్ ఛైర్మెన్ ఆరూరురామమూర్తి, కార్యదర్శి చంద్రశేఖర్‌రావు, ట్రెజరర్ శ్రీధర్‌రావు, డిస్టిక్ ఆఫీసర్లు శివప్రసాద్; లక్ష్మణ,నటకలబద్రి,శ్రీకలెక్షన్ బద్రీ, చిత్తూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య మహాసభధ గౌరవాధ్యక్షులు ఆరూరు ప్రసాద్‌బాబు, అధ్యక్షులు చల్లూరు ద్వారకనాథ్, బైసానిబాబురావు, మధుబుక్‌స్టాల్ కిరణ్ పాల్గొన్నారు.

## బిజెపి,టిడిపి,జనసేన నాయకులతో సమావేశం

చిత్తూరురూరల్, మార్చి 16ప్రభాతవార్త: జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి, టిడిపి, జనసేన జిల్లా పార్టీ నేతలతో ఉమ్మడి సమావేశంను బిజెపి జిల్లా అధ్యక్షులు జగదీశ్వరనాయుడు అధ్యక్షతన ఏర్పాటుచేసారు. ఈ సమావేశంలో చంద్రగిరి, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ అభ్యర్థులు పులివర్తినాని, గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్‌ల గెలుపుకోసం మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులుపులివర్తినానీ,జనసేనరాష్ట్రకార్యదర్శికవితఆరణి, మాజీ శాసనసభ్యులు ఎన్‌పి వెంకటేశ్వరచౌదరి, సికెబాబు, ఎయస్ మనోహర్, మాజీ రాజ్యసభ సభ్యులు దుర్గారామక్రిష్ణ, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు పాల్గొన్నారు.

## రొంపిచెర్లలో వైకాపా భారీ స్కూటర్ ర్యాలీ

రొంపిచెర్ల, మార్చి 16 ప్రభాతవార్త

మండల పరిధిలో శనివారం వైకాపా ఆధ్వర్యంలో భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. గానుగచింత, మోటుమల్లెల,పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె, చెంచెంరెడ్డివారిపల్లె గ్రామపంచాయతీలలో ఈ ర్యాలీ సాగింది. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, వైకాపా మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, నాయకులు చెంచురెడ్డి, నూలురెడ్డెప్ప, విజయశేఖర్, కోటా వెంకటరమణ, అలీంఖాన్, సూర్యనారాయణరెడ్డి, సురేంద్రనాయుడు,బాబు, విజయభాస్కరరెడ్డి, యర్రంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

**– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్**



**కుప్పం, మార్చి 16 ప్రభాతవార్త** కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 16వవార్డులో గాంధీ విగ్రహం ఎదుట డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ప్రజల సౌకర్యార్థం సిసి రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, నేతలు రాజా, ఇందుశేఖర్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

చిట్టమూరు, మార్చి 16 ప్రభాతవార్త

ఆర్టీసీ బస్సును లారీ వెనుక నుంచి ఢీకొన్న సంఘటన చిట్టమూరు మండలం బయ్యావారికండ్రిగ గ్రామ ఆర్అండ్‌బి రహదారి పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ బలరామ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట నుంచి మల్లాం వైపు ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ ప్రయాణికులను దించే క్రమంలో బయ్యావారికండ్రిగ గ్రామం వద్ద ఆగింది. అయితే నాయుడుపేట నుంచి వస్తున్న లారీ ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. అయితే బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలు మినహా ఎలాంటి అపాయం చోటుచేసుకోలేదు. బస్సులోని ప్రయాణికులు ముగ్గురిని 108 ద్వారా మల్లాంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ బలరామ్ మాట్లాడుతూ ఈ సంఘటనలో ప్రయాణికులెవరికీ ప్రమాదం చోటుచేసుకోలేదని, ఢీకొన్న లారీని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

## ఆయిల్ దుకాణంలో చోరీ

**ఆయిల్‌బాక్స్‌లు, సెల్‌ఫోన్లు, నగదు అపహరణ**

నాయుడుపేట టౌన్ మార్చి 16 ప్రభాతవార్త

నాయుడుపేట పట్టణంలోని ఆంధ్రాబ్యాంక్ పక్కన ఉన్న తిరుమల పామాయిల్ దుకాణంలో శుక్రవారంరాత్రి గుర్తుతెలియని దుండగులు షట్టర్లు పగలగొట్టి చోరికి పాల్పడినట్లు బాధితుడు తిరుమల వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. రాత్రిషాపులో ఎవరులేని సమయంలో గుర్తుతెలియని దుండగులు షాపుతాళాలు పగలగొట్టి అందులో ఉన్న పామాయిల్ బాక్స్‌లు,సెల్‌ఫోను, రూ. 20 వేల నగదును అపహరించుకొని వెళ్ళినట్లు బాధితుడు నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సిఐ సుధాకర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి చోరీ జరిగిన పామాయిల్ దుకాణంను పరిశీలించారు. అనంతరం కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దొరవారిసత్రంలో రేషన్‌బియ్యం అక్రమ రవాణా

**పట్టించుకోని సివిల్ సప్లయర్స్–పోలీసులు**

దొరవారిసత్రం మార్చి 16 ప్రభాతవార్త:

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్మాకంగా పేదప్రజలకు ఒక్క రూపాయకే కేజిబియ్యం అందజేయాలన్న దృడసంకల్పంతో పనిచేస్తుంటే దొరవారిసత్రం మండలంలో అధికారుల పర్యవేక్షణలోపం నిర్లక్ష్యం కారణంగా పేదప్రజలకు అందాల్సిన రేషన్‌బియ్యం పక్కదారి పడుతున్నాయి.ఈక్రమంలో దొరవారిసత్రం మండలానికి చెందిన కొంతమంది అక్రమార్కులు నియోజకవర్గంలో సేకరించిన రేషన్‌బియ్యంను నెల్లబలి–కలగుంట ప్రాంతాలకు తరళించి భారీస్థాయిలో నిల్వచేసి అక్కడ నుండి రాత్రిసమయంలో లారీలతో నెల్లూరుకు రేషన్‌బియ్యంను అక్రమంగా తరళిస్తున్న సంబందిత సివిల్‌సప్లయర్స్–పోలీసులు పట్టించుకోవడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు.ముఖ్యంగా డిసంబరులో వచ్చిన మిచ్చాంగ్ తుపాన్‌కు ప్రభుత్వం ప్రజలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో ఉచితంగా రేషన్‌బియ్యంను పంపిణీ చేయగా అక్రమార్కులు కొంతమంది అధికారులను మేనేజ్‌చేసి ప్రజలకు అందకుంగా పక్కదారి పట్టించారన్న ఆరోపణలు వెలువడుతున్నాయి.మరికొందమంది ధళారులు గ్రామాల్లో సేకరించిన రేషన్‌బియ్యంను ఆటోల ద్వార నెలబల్లికి తరళించి భారీస్థాయిలో నిల్వచేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లాఉన్నతాదికారులు స్పందించి రేషన్‌బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## సేంద్రియ రసాయనాలతో చేసిన ఆకుకూరలు తినండి

**యోగా మాస్టర్ రాజా**



చిల్లకూరు, మార్చి 16, ప్రభాతవార్త

పురుగు మందులు ఉపయోగించ కుండా సేంద్రియ ఎరువులతో తయారు చేసిన కూరగాయలు తినడం ద్వారా ఆరోగ్యం బాగుంటుం దని తిరుపతి జిల్లా గూడూరు యోగా మాస్టర్ రాజా తెలిపారు. తన యోగా శిష్యుడైన తులసి రామ్, గూడూరు డివిజన్‌లోని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సేంద్రియ ఎరువులతో పాలకూర, తోటకూర, మరి కొన్ని రకాల ఆకుకూరలను చిల్లకూరు వినాయక గుడి దగ్గర ఏర్పాటు చేసిన కోకోలు గార్డెన్‌లో పండించారు. ఈ ఆరోగ్య కరమైన ఆకుకూరలు అందరికీ అందుబాటు ధరలలో లభిస్తాయని, ప్రజలు వీటిని ఆహారంలో తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ ఆకుకూరలు కావాల్సిన వారు కోకోలు గార్డెన్, చిల్లకూరు వినాయక గుడి దగ్గరలో అయినా సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు నరసింహులు, భాస్కర్, వ్యాయామ క్రీడాకారుడు వెంకటేశ్వర్లు, సల్మాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని పాటించాలి

**ఆర్డీవో కిరణ్ కుమార్**



గూడూరు, మార్చి 16, ప్రభాతవార్త

ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన వెంటనే కోడ్ అమల్లో ఉంటుందని ఎన్నికల నియమ నిబంధనలను ఎవరు అతిక్రమించినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కిరణ్ కుమార్ హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఎన్నికల ఏర్పాట్లు పై ఆర్డీవో కిరణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు బ్యానర్లు తొలగించాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. పలు ప్రాంతాల్లో చెక్ పోస్టులు చేస్తున్నామని పాత నేరస్తులను బైండోవర్ చేయడం జరిగిందని వెల్లడించారు. ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బహిరంగ సభలు ర్యాలీలకు తప్పనిసరిగా ఆర్డీవో, డిఎస్పీ పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఎవరు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రాజీయే రాజమార్గం



గూడూరు, మార్చి 16, ప్రభాతవార్త

రాజీయే రాజ మార్గమని లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బును ఆదా చేసుకోవచ్చని గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి పర్వీన్ సుల్తానా బేగం వెల్లడించారు. గూడూరు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో జాతీయ మెగా లోక్ అధాలత్ నిర్వహించారు. పలు కేసుల్లోని కక్షిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడవ అదనపు జిల్లా జడ్జి పర్వీన్ సుల్తానా బేగం మాట్లాడుతూ చిన్న చిన్న గొడవలతో కేసులు పెట్టుకుని సంవత్సరాల తరబడి కోర్టు చుట్టూ తిరగడం వల్ల డబ్బు సమయం వృధా అయిపోతుందన్నారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల ఇరు వర్గాల వారు మనశ్శాంతిగా జీవించవచ్చని సూచించారు. ఈ సమావేశంలో సబ్ జడ్జిలు, లాయర్లు, కక్షిదారులు పాల్గొన్నారు.

## సంబరాలు చేసుకున్న టిడిపి నాయకులు, యువత

గూడూరు, మార్చి 16, ప్రభాతవార్త

సైకో పాలనకు ఇక సెలవు అని మాజీ శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని గమళ్లపాలెం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం ముందర బాణా సంచా కాల్చి టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ వైసిపి ఫ్యాన్ రెక్కలు ముక్కలవడం ఖాయమన్నారు. ఎన్నికల కోడ్ అమలుతో రాక్షస పాలన నుండి ప్రజలకు విముక్తి లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పులి శ్రీనివాస రావు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, మదురెడ్డి, మన్నెమాల సుబ్బయ్య, బాబు, జాఫర్ హుస్సేన్, యువత వేముల సునీల్, గుండాల సందీప్, పురిణి దయాకర్, అరుణ్ కుమార్, పార్వతయ్య, అరవిందు, రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ సభ్యులు అసనాపురం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో పొట్టిశ్రీరాములు జయంతి

సూళ్లూరుపేట, మార్చి 16 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలో అమరజీవి పొట్టిశ్రీరాములు 123వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం కచ్చేరి వీధిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. పట్టణంలోని వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్‌కు చెందిన ఉప్పాళ్ల సునీత, కళావతి, త్రిపుర, జోత్స్న, నాగసృజన, రావూరి సుబ్రహ్మణ్యం, అమర్‌పాల్ ఉన్నారు.

## లోక్ అదాలత్‌లో 40 కేసులు పరిష్కారం



సూళ్లూరుపేట, మార్చి 16 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో 40 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. వ్యయభారాలకోర్చి కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్‌అదాలత్‌ను వేదికగా చేసుకొని కేసులను పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని కోరారు. లోక్ అదాలత్‌లో 35 క్రిమినల్ కేసులు, మూడు భరణం కేసులు, రెండు సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి.

## ప్రజాగళం సభకు తరలిరావాలి



గూడూరు, మార్చి 16, ప్రభాతవార్త

వైసిపి పాలనలో ఇబ్బందులు పడ్డ అన్ని వర్గాల ప్రజలు చిలకలూరిపేటలో జరిగే ప్రజా గళం సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు కోరారు. గూడూరు నియోజకవర్గ, జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద జరిగే సభలో అన్ని వర్గాల ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న ప్రజా వ్యతిరేకతను తెలియచేయడం జరుగుతుందని, ఈ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి రాష్ట్ర భవితకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. సమావేశంలో పిఠసి మోహన్, నాయకులు ఇంద్రవర్ధన్, అవినాష్, సనత్, రాజశేఖర్, పెంచలయ్య, మురళి, సాయి, శివ, వసంత్, శంకర్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

## నేదురుమల్లి కుటుంబం ప్రజాసేవకే అంకితం

**మాజీ మంత్రి రాజ్యలక్ష్మి**



బాలాయపల్లి, మార్చి 16, ప్రభాతవార్త

ప్రజాసేవకే నేదురుమల్లి కుటుంబం జీవితాన్ని అంకితం చేస్తున్నట్లు మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి తెలిపారు. బాలాయపల్లి మండలం సుబ్రమణ్యం, జయంపు తదితర గ్రామాల్లో ఆమె వైసిపి నాయకులను కలుసుకొని పలకరించారు. ఎలాంటి సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షుడు వెందోటి కార్తీక రెడ్డి, మాజీ ఏఎంసి ఛైర్మన్ మధుసూధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## దళిత గిరిజనులపై ఫారెస్టు, పోలీసు వారు దౌర్జన్యం ఆపాలి



వెంకటగిరి టౌన్, మార్చి 16, ప్రభాతవార్త

పెట్లూరు గ్రామ భూ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో సర్వే నెంబరు 12–1 ఉన్న 519 ఎకరాల మేత పోరంబోకు ప్రభుత్వ భూమిని దళిత గిరిజనులు పెద్దలు ఆక్రమణ చేసుకొని చెట్టు పుట్ట కొట్టుకుని సాగుకు సిద్ధం చేసుకుంటుండగా పోలీసులు అటవీ శాఖ సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. పొలంలో పనులు చేసుకుంటున్నా దళిత గిరిజన పేదలపై పోలీసులు ఫారెస్టు వారు దౌర్జన్యంతో బెదిరింపు పేదలకి పోలీసులు ఫారెస్ట్ వారు మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా ఫారెస్టు, పోలీస్, రెవెన్యూ వారిని ఉద్దేశించి సిపిఎం పార్టీ వెంకటగిరి ఏరియా ఆర్గనైజర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి ఫారెస్టు వారు దళిత గిరిజన పేదలని అడుగడుగునా అడ్డుకొంటూ ఉన్నారని అన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పెట్లూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూముల్ని దళిత గిరిజన పేదలకు పంపణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రజానాట్య మండలి నాయకులు గోపాలయ్య, రమణయ్య, గురవయ్య, కోటేశ్వర రావు, వెంకటగరమణయ్య, రేణుక పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్‌తో అన్న క్యాంటీన్ మూసివేస్తున్నాం

**మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**

వెంకటగిరి టౌన్, మార్చి 16, ప్రభాతవార్త

ఎన్నికల కోడ్ వస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టిడిపి అభ్యర్థిని లక్ష్మి సాయి ప్రియ తెలిపారు. వెంకటగిరి పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ చివరి రోజు కావడంతో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ కుమార్తె లక్ష్మీ సాయిప్రియ స్వయంగా పేదలకు ఉచితంగా అన్నదానం చేశారు. 521 రోజులు పాటు నిరాటంకంగా అన్న క్యాంటీన్ నిర్వహించినట్లు తెలిపారు. మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వర రావు, నాయకులు ఆనంద్, నాగరాజా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బాలాయపల్లిలో వైసిపి సంబరాలు

బాలాయపల్లి, మార్చి 16, ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాలో వెంకటగిరి నియోజకవర్గానికి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ప్రకటించిన సిఎం జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ మండలం పరిధిలోని ప్రతి గ్రామంలో టపాసులు కాల్చి స్వీట్లు పంచుకొని వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ వెందోటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర వైఎస్ఆర్‌సిపి పార్టీ మహిళా అధికార ప్రతినిధి రావిదేవికా చౌదరి, పిఎసిఎస్ అధ్యక్షులు పల్లంటి రాంబాబు, వైఎస్ఆర్‌సిపి నాయకులు మెల్లల వెంకటేశ్వర్లు, కాటూరి ప్రసాద్ రెడ్డి, సర్వేపల్లి సురేష్, వెందోటి హరికృష్ణారెడ్డి, మద్దూరు వెంకటేశ్వర్లు, లోక్ నాయుడు, వైసిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మండలంలో బిజెపి విస్తృత ప్రచారం

**.శ్రీకాళహస్తిరూరల్/తొట్టంబేడు, మార్చి 16 ప్రభాతవార్త** బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాలతో, రాష్ట్ర కార్యదర్శి మరియు నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కోలా.ఆనంద్ కుమార్ సూచనలతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బిజెపి నాయకులు అలుపెరగకుండా పర్యటించి కోలా.ఆనంద్ గెలుపు కోసం విస్తృతం చేశారు. ఇందులో భాగంగా శనివారం నియోజవకర్గంలోని తొట్టంబేడు మండలం, శ్రీకాళహస్తి మండల, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో ప్రతి ఓటరు యొక్క ఇంటికి వెళ్ళి మోదీ సంక్షేమ పథకాల గురించి తెలుపుతూ కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటిగోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు వేడాం.కృష్ణయ్య, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శిరవి ఆచారి, పలువురు మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మాజీ ఎంఎల్ఏ మునిరామయ్యను కలసిన సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 16 ప్రభాతవార్త

మాజీ ఎంఎల్ఏ, సీనియర్‌నాయకులు సత్రవాడ మునిరామయ్యను తెలుగుదేశంపార్టీ ఎంఎల్ఏ అభ్యర్థి బొజ్జలసుధీర్‌రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీవీనాయుడుతో సమావేశం అనంతరం మునిరామయ్యను కలసి తెలుగుదేశంపార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. ఆయనతోపాటు యువనాయకుడు సత్రవాడ ప్రవీణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పట్టణంలో వైకాపా నాయకులు ర్యాలీ

శ్రీకాళహస్తి, మార్చి 16 ప్రభాతవార్త



నియోజకవర్గ వైకాపా ఎంఎల్ఏ అభ్యర్థిగా బియ్యపుమధుసూధన్‌రెడ్డి పేరు ఖరారు కావడంతో పట్టణంలోని వైసిపి నాయకులు, దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక పెండ్లిమండపం వద్ద నుంచి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. వైకాపా జెండాలు చేపట్టుకుని జై జగన్, జై మధుసూధన్‌రెడ్డి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిఎన్‌టియుసి పదవికి సుబ్బారావు రాజీనామా

**తిరుపతి హెల్త్, మార్చి 16, ప్రభాతవార్త** తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల సుబ్బారావు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శనివారం ప్రకటించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించకుండా టిడిపి అధినేత చంద్రబాబు వడ్డెర సామాజిక వర్గానికి ఒక్క ఎమ్మెల్యే గాని, ఎంపి సీటు గాని కేటాయించుకోవడం బాధాకరమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర అసంఘటిత కార్మిక జనరల్ సెక్రెటరీ విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీరాజు రెడ్డప్ప, వడ్డెర జిల్లా ఉపాధ్యక్షులు తిమ్మశెట్టి రమణ, రాష్ట్ర అసంఘటిత కార్మిక నాయకులు తేపల్లివిజయ శ్రీనివాస్, వడ్డెర జిల్లా సెక్రెటరీ కోటకొండ నరేష్ పాల్గొన్నారు.

## డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో అరణి శ్రీనివాసులకు అపూర్వ స్వాగతం

### సింగాల గుంటలో ప్రజల నీరాజనం



**తిరుపతి హెల్త్, మార్చి 16, ప్రభాతవార్త** తిరుపతిలో జనసేన, టిడిపి, బీజేపి ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డా. పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో సింగాలగుంటలో శనివారం తిరుపతి ఉమ్మడి అభ్యర్థి అరణి శ్రీనివాసులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చందు, రాజేష్ యాదవ్, భాను, కృష్ణయ్య, ఆనంద్, కుమార్, దిలీప్ సుబ్రమణ్యం, మధులత, దివ్య, శిరీష, లక్ష్మి, కోకిల, జయంతమ్మ, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

## గోవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



తిరుపతి క్రీడ, మార్చి 16, ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి కామర్స్ విభాగంకు చెందిన వి. గోవర్ధన్ రెడ్డి పరిశోధక విద్యార్థికి శ్రీ వెంకటేశ్వర విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎం. దామ్లా నాయక్ తెలిపారు. కామర్స్ విభాగపు ప్రొఫెసర్ డా. పివి నర్సయ్య మార్గదర్శకత్వంలో మేనేజ్మెంట్ ఆఫ్ వర్కింగ్ క్యాపిటల్ ఇన్ సెలెక్ట్ సిమెంట్ కంపెనీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపైన పరిశోధనా గ్రంథాన్ని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంకు సమర్పించినట్లు తెలిపారు. వి. గోవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

## శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో వరల్డ్ సోషల్ వర్క్ డే సెలబ్రేషన్స్

**తిరుపతి మహిళావర్సిటీ, మార్చి 16, ప్రభాతవార్త** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగంలో వరల్డ్ సోషల్ వర్క్ డే సెలబ్రషన్స్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యున్ వివిన్ షేర్డ్ ఫ్యూచర్ ఫర్ ఇన్ఫర్మేటివ్ చేంజ్ అనే అంశంపై ఈ సంవత్సరం వరల్డ్ సోషల్ వర్క్ డే పురస్కరించుకుని, సోషియల్ వర్క్ అసోసియేషన్ స్టాఫ్ అడ్వైసర్ ప్రొ. ఐవి లలిత కుమారి ఆధ్వర్యంలో సోషల్ వర్క్ విభాగాధిపతి డా.పి. తావితా తులసి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు! ప్రొ. వి. ఉమ, ఫార్మర్ వైస్ చాన్సలర్, ఎస్‌పిఎంవివి, తిరుపతి వారు కి నోట్ స్పీకర్‌గా హాజరైయ్యారు.డా. మల్లేశ్వరమ్మ, డా. హైమావతి, డా. చైతన్య (పూర్వ విద్యార్థినిలు), కౌన్సలర్స్ కుమారి, శశిరేఖ, చైతన్య, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థినిలు, మినిస్టిరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి కావాలంటే వైకాపాను గెలిపించండి..!

.తొట్టంబేడు, మార్చి 16 ప్రభాతవార్త



పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చే పరిపాలన అందించేందుకు, అందుబాటులో ఉన్న తన భర్త బియ్యపుమధుసూధన్‌రెడ్డిని, రాష్ట్రంలో వైఎస్‌ఆర్‌సిపి పార్టీని మరోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్దంగా ఉండాలని ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి సతీమణి బియ్యపుశ్రీవాణి తెలిపారు. శనివారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ప్రతి గడపలో జగనన్న పథకాల ద్వారా లబ్దిపొందిన వారితో మమేకమవుతూ తాము గెలిచినప్పటి నుంచి అనునిత్యం ప్రజాసేవలో తరిస్తూ కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలచిన ఒకే ఒక వ్యక్తి తన భర్త బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. ముందుగా బియ్యపుశ్రీవాణికి తొట్టంబేడు మండల అధ్యక్షుడు ఉన్నంవాసుదేవనాయుడు, ఎంపిపి ఉన్నంనిర్మల మరియు వైకాపా నాయకులు కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లత, పిఏసిఎస్ ఛైర్మన్ మణిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ వచ్చినందుకు తెదేపా సంబరాలు



**ఏర్పేడు, మార్చి16, ప్రభాతవార్త;** ఎన్నికల కోడ్ వచ్చినందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సాయంత్రం ఏర్పేడులోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ మూడు రాజధానుల పేరిట రాష్ట్ర ప్రజలను పిచ్చోళను చేసి మోసం చేసిన ఘనత సైకో పాలనకు నిదర్శనమన్నారు. న్యాయం కోసం మాట్లాడిన ప్రతి ఒక్కరిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు తరలించిన ఘనత కూడా ఆయనదేనన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు సూరినారాయణ, నాగేశ్వర్‌రావు, కృష్ణవేణి, మునయ్య, బొమ్మినేటి రమణయ్య యాదవ్, సదా, శంకర్, మస్తాన్‌నాయుడు, సుబ్రమణ్యం యాదవ్, నిరంజన్, సోమశేఖర్ యాదవ్, సుబ్బరామిరెడ్డి, వెంకటముని, నారాయణశెట్టి, గోల్డ్‌మెన్ నాయుడు, దయాకర్, వెంకటస్వామి, బత్తిరెడ్డి తదితర తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలందరికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత

తిరుపతిరూరల్, మార్చి 16 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలంలోని పేదలందరికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పండగ వాతావణంలో అందజేయడం జరిగిందని చంద్రగిరి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శనివారం తిరుచానూరు, ముండ్లపూడి, పాడిపేట, పేరూరు, చెర్లోపల్లి, చిగురువాడ, అవిలాల పంచాయతీలలో లబ్దిదారులకు స్వయంగా రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం జగనన్న నిరుపేదలకు ఏ కష్టం రాకుండా సంక్షేమ పథకాల అమలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యశోధ, జడ్పిటిసి రత్నమ్మ, సింగిల్ విండో చైర్మెన్ హేమాద్రిరెడ్డి, చెర్లోపల్లి సర్పంచ్ సుభాషిణి, వైకాపా నేత శుభగిరి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి



**తిరుపతిరూరల్, మార్చి 16 ప్రభాతవార్త:** కార్మిక చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఉప కార్మిక కమీషనర్ అఖిల్ తెలిపారు. శనివారం రాస్ బిల్డింగ్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారులకు, సిబ్బందికి బిఓసిడబ్లుడబ్ల్యు చట్టం, కార్మిక చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు.

## తెదేపా పార్టీ తీర్థం పుచ్చుకున్న తాటిపర్తి, కల్లిపూడి గ్రామస్తులు



**తొట్టంబేడు, మార్చి 16 ప్రభాతవార్త** తొట్టంబేడు మండలంలోని తాటిపర్తి, కల్లిపూడి గ్రామస్తులు నియోజ కవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సారథ్యంలో తాటిపర్తి ఎంపిటిసి భర్త బొల్లిపల్లిశోభన్ బాబునాయుడు, సురేంద్ర, బాలాజీ, రామ్మూర్తి, రమేష్‌నాయుడు, భార్గవ్, ప్రకాష్, సుబ్రమణినాయుడు, సుధాకర్, మనోహర్‌నాయుడు, మునిరత్నం నాయుడు, పునీత్, నిరంజన్, హరినాయుడు, మురళీనాయుడు, బాబునాయుడు, రాకేష్, చెంచయ్య, దాము, రాకేష్, శంకరయ్య, ప్రహ్లద్, నవీన్‌లతో పాటు మరో 100మంది తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

## సొంతగూటికి యస్‌సి సెల్ నాయకులు



**తొట్టంబేడు, మార్చి 16 ప్రభాతవార్త** ఎళ్ళ తరబడి తెలుగుదేశంపార్టీలో ఉన్న మాజీ ఎంపిటిసి మరియు యస్‌సిసెల్ నాయకులు కొన్నలిరమేష్ మరియు కనపర్తి నుంచి డీలర్ ఆనంద్, పూడి నుంచి సురేష్‌లు శనివారం ఊరందూరులోని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి, బొజ్జలబృందమ్మల సమక్షంలో సొంతపార్టీ తెలుగుదేశంపార్టీలోకి మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, పేరంధనంజయులునాయుడు, చెలికంపాపిరెడ్డి, మునిరాజనాయుడు, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు 123వ జయంతి

**శ్రీకాళహస్తి, మార్చి 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని బజారువీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం పొట్టి శ్రీరాములు 123జయంతి వేడుకలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగనిరతని కొనియాడారు. ఈ సందర్భంగా నిరుపేదలకు ఇక్కడ అన్నదానం జరిపారు.ప్రతి ఏడాదిలాగే యువత ఈ కార్యక్రమాలను నిర్వహించారు.శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు తబ్జుల రాముగుప్తా సారథ్యంలో ఆలయ పాలకమండలి అధ్యక్షులు జూరుగంటి మురళీమోహన్ గూప్తకార్యదర్శి జాలాది మోహన్, కోశాధికారి మురారి జే.స్వరూప్, వాసవి సేవకులు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## తిరుచ్చి రథంపై ఊరేగిన స్వామి అమ్మవార్లు



**శ్రీకాళహస్తిరూరల్, మార్చి 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తిరుచ్చివాహనంలో రథోత్సవం నిర్వహించారు. ఇక్కడి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు భక్తులనుంచివిశేష స్పందన వస్తుంది.టిటిడి సారథ్యంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.తిరుచ్చి వాహనంలో స్వామి అమ్మవార్లు దర్శనమిచ్చారు. టిటిడి సారథ్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతున్నారు.ఉత్సవాలను డిప్యెఇఓ దేవేంద్రబాబు, ఎఇఓ ప్రార్థసారథి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవికుమార్‌రెడ్డిఆలయ పర్యవేక్షకులు సదాశివయ్య, అనంద్‌అర్చకులు కృష్ణస్వామి, బాబూ స్వామి రమణస్వామి సారథ్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

## వేలవేడు గ్రామసచివాలయం ప్రారంభం

శ్రీకాళహస్తి రూరల్ మార్చి 16 ప్రభాతవార్త



మండలంలోని వేలవేడు గ్రామసచివాలయ భవనాన్ని శనివారం శాసనసభ్యుడు సతీమణి శ్రీవాణిరెడ్డి సచివాలయ ప్రారంభించారు.ఈసందర్భంగాఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ది పథకాలతో ప్రజలు లబ్దిపొందరన్నారు. ఈ మండల అధ్యక్షుడ.వయ్యాల.సర్పంచ్‌బాలగురవమ్మ, వైస్‌ఎంపిపి భానుమూర్తి, గుణశేఖర్‌రెడ్డి,వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 338 మందికి ఉద్యోగాలు

పుత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త :



ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 338 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మొత్తం 25 కంపెనీలు పాల్గొన్న మేళాకు 477 మంది హాజరవగా 338 మంది విద్యార్థులకు సంబంధిత కంపెనీ యాజమాన్యాలు ఉద్యోగ ధృవీకరణ పత్రాలు అందించారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించింది. కార్యక్రమంలో నగరి, సత్యవేడు డిగ్రీ కాలేజీల ప్రిన్సిపల్స్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్, డాక్టర్ సురేష్‌కుమార్ పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## మల్లాలమ్మ జాతరలో భానుప్రకాశ్



**పుత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త :** గేట్‌పుత్తూరులో జరిగిన మల్లాలమ్మ అమ్మవారి జాతరలో శనివారం నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గాలి భానుప్రకాశ్ పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. జాతర నిర్వహించిన మేదర సంఘం ఈ సందర్భంగా ఆయనను పూలమాల, శాలువాతో సత్కరించింది. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలంలో కేంద్ర బలగాలు కవాతు

**నింద్ర,మార్చి 16 ప్రభాతవార్త :** దేశంలో ఎన్నికలు కోడ్ అమలులో రావడంతో మండలంలోని నింద్ర,కొప్పేడు,ఎలకాటూరు గ్రామ పంచాయితీలలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించినారు. రాత్రిపూట గ్రామాలలో ప్రత్యేక నిఘాలు ఏర్పాటు చేసి ఎక్కడైన అవాంచనీయమైన సంఘటన పాల్పడినట్లుయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యస్ఐ రామచంద్రన్ అన్నారు.

## నగరి వైకాపా అభ్యర్థి రోజా నియామకంపై హర్షం



**నింద్ర,మార్చి 16 ప్రభాతవార్త :** నగరి నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ అభ్యర్థి ఆర్‌కె రోజా నియామకంపై మండలంలోని నాయకులు,కార్యకర్తలు,అబిమానులు హర్షం వ్యక్తం చేసారు.శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయిలో వైకాపా 25 యంపి,175 ఎమ్మెల్యే అభ్యర్థిల ప్రకటనలో నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కె రోజా సెల్వమణి నియామకంతో హర్షం వ్యక్తం చేసారు. మూడో పర్యాయం ఆర్‌కె రోజా ఎమ్మెల్యేగా గెలుపించుకుంటామని అన్నారు.

## ఆరోగ్య సంరక్షణలో అగ్రగామి ఆయుర్వేదం డాక్టర్ రవికుమార్




**తిరుపతి హెల్త్, మార్చి 16, ప్రభాతవార్త** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 3 కుంట్రపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు ఆయుర్వేదం పై అవగాహన కల్పించి ఉచిత మందుల పంపిణీతో పాటు ఆరోగ్య సూత్రాలు, వాటి గురించి అవగాహన, నిత్యజీవితంలో అనుసరించడం ద్వారా కలిగే ఉపయోగాలు, వ్యాధుల నివారణ తదితర అంశాలపై రవి ఆయుర్వేద హాస్పిటల్ పంచకర్మ స్పెషలిస్ట్ డాక్టర్ రవికుమార్ క్షారసూత్రా స్పెషలిస్ట్ డాక్టర్ జ్యోస్న వివరించారు. 100కి పైగా గ్రామస్తులు ఈ క్యాంప్ ద్వారా లబ్ధిపొందారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిని డా. నీరజ, సర్పంచ్ శుభాపద్మనాభం రెడ్డి, సెక్రటరీ మురళి, వాలంటీర్లు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

తిరుపతి హెల్త్, మార్చి 16, ప్రభాతవార్త

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిన పురస్కరించుకుని తిరుపతి రుయా ఆసుపత్రి ముందు ఉన్న ఆయన విగ్రహానికి బిజేపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుండాల గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహములో పాల్గొని జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. స్వతంత్రం అనంతరం భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్న ఆంధ్రావనికి ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేస్తూ 48 రోజులు పాటు ఆమరణ నిరాహారదీక్ష కావాలని డిమాండ్ చేస్తూ 48 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆశువులు బాసారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కేఎన్ రాజా, పొన్నాల జేజిరెడ్డి, కుమార్, కొండే చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, శాంబోల హరినాథ్, శ్రీనివాసులు పలువురు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి ఖాయం : ఆదిమూలం



నారాయణవనం, మార్చి 16 ప్రభాతవార్త :

నారాయణవనం మండలకేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం మధ్యాహ్నం సత్యవేడు టిడిపి అభ్యర్థి కోనేటి ఆదిమూలం నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపిలో సుమారు 14 ఏళ్లపాటు పని చేసినప్పటికి ఇందులో 5ఏళ్ల వైకాపా ఎమ్మెల్యేగా సత్యవేడుకు పని చేసినప్పటికి పెత్తందారుల వద్ద బానిస బతుకుల్లో బతికినట్టు గుర్తు చేశారు. శనివారంతో జగన పాలనకు విముక్తి కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎన్ భాస్కరన్, పి గోవిందస్వామి, కెఎస్‌రవి, కందస్వామినాయుడు, బిత్ర బాలసుబ్రమణ్యం, జయచంద్ర నాయుడు, బాల చంద్రనాయుడు, మాణిక్యంరెడ్డి, లోకయ్య, ఆరుముగం, వేలురెడ్డి, గోవిందశెట్టి, టికె గణేష్‌బాబు, దానా పరశురామయ్య, మోహన్‌బాబు, అచ్చుకట్ల హరి, ఆలీ, బాలయ్య, బిఎం నరేష్, నరేష్, దొరవేలురెడ్డి, చీరాలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**వడమాలపేట, మార్చి 16 ప్రభాతవార్త:** పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో పద్మావతి తెలిపారు. ఈ నెల 18 నుంచి పది పరీక్షలు ప్రారంభమవుతుండడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అన్ని గదుల్లో బల్లలు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 8 పాఠశాలల నుంచి 341 విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వడమాలపేటలో బాలుర పాఠశాల కేంద్రంలో 144 మంది, బాలికల పాఠశాలలో 103 మంది పరీక్ష రాయనుండగా పత్తిపుత్తూరు, సీతారామపురం హైస్కూలు విద్యార్థులు రామచంద్రాపురం మండలంలోని సొరకాయలపాళెం కేంద్రంలో, తడుకు ఆర్ఎస్, శ్రీ బొమ్మరాజపురం హైస్కూలు విద్యార్థులు పుత్తూరురూరల్ మండలం గొల్లపల్లి హైస్కూలులో పరీక్షలు రాస్తారని ఆమె తెలిపారు.

## టీడీపీ వస్తేనే రాష్ట్రం అభివృద్ధి

**వడమాలపేట, మార్చి 16 ప్రభాతవార్త:** టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తోందని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని తిరుమండ్యం గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం టీఎన్‌యూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్రహ్మణ్యంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.నాయకులుధనంజయులునాయుడు,మణిరాజు,వెంకటయ్య,హేమావతి, లక్ష్మీప్రసన్న, మునిశేఖర్, పెద్దబ్బరాజు, శేషాద్రి యాదవ్, మునిరాజ, సుబ్బారెడ్డి, జ్యోతిరెడ్డి, శ్రీనివాసులు, విశ్వనాథ్, కృష్ణయ్య, వెంకటరమణ, హరి, వెంకయ్య, గురవయ్య, తిరుమణ్యం, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

## నగరిలో వైసీపీ సంబరాలు

**నగరి, మార్చి 16 ప్రభాతవార్త:** మూడోసారి నగరి బరిలో వైసీపీ అభ్యర్థిగా ఆర్.కె.రోజా వైసీపీ పార్టీ ప్రకటించారు. శనివారం నగరిలో వైసీపీ నాయకులు, నగరి నలుమూలల సంబరాలు చేసుకున్నారు. మంత్రి రోజా మూడో సారి హ్యాట్రిక్ కొడుతుందని వైసీపీ నాయకులు సంబరాలు చేశారు.

## సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు

**విజయపురం, మార్చి 16 ప్రభాతవార్త:** సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించినట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని విజయపురం దళితవాడ, గంగమాంబాపురం, పన్నూరు సబ్‌స్టేషన్, పన్నూరు గ్రామాల్లో సెంట్రల్ పోలీసు ఫోర్సుతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు.ఎస్ఐజయప్ప,పోలీసుసిబ్బంది,సెంట్రల్‌ఫోర్సు పాల్గొన్నారు.

## రోజాను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంపై హర్షం

**విజయపురం, మార్చి 16 ప్రభాతవార్త:** నగరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రోజాను ప్రకటించడంపై మండల వైసీపీ నాయకులు శనివారం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్, విజయపురం, పాతార్కాడు, మహారాజపురంలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికలకోడ్‌ను ఉల్లంగిస్తే పార్టీలపై చర్యలు

సత్యవేడు, మార్చి16, ప్రభాతవార్త :



సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల నిర్వాహణ అధికారి నరసింహులు రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు అన్ని కూడా ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని భాద్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. కోడ్ అమల్లో ఉన్న నేపధ్యంలో ఎన్నికల అధికారులు చేపట్టేటువంటి చర్యలకు పూర్తిస్థాయిలో సహకరించి ఎన్నికల నియామావళిని పాటించాలన్నారు. బిజేపి మండల అధ్యక్షుడు మునిప్రతాప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ శేషాద్రి, వైసిపి నేత శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## జేడిఆర్‌కు మద్దతు తెలిపిన యువత



సత్యవేడు, మార్చి 16, ప్రభాతవార్త :

మండలంలోని దాసుకుప్పంలో శనివారం తెలుగుదేశం పార్టీ యువత జేడి రాజశేఖర్‌కు మద్దతు తెలిపారు. సత్యవేడు అసెంబీస్థానం వైసిపి నుండి వలస వచ్చిన ఎమ్మెల్యే ఆదిమూలంకు అధిష్టానం కేటాయించడం పట్ల అసహనం వ్యక్తం చేసిన జేడి రాజశేఖర్, తాను తెదేపా నుండి రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో తెలుగు యువత ఆయనకు మద్దత్తు తెలియజేస్తూ..జేడిఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ అధిష్టానం దృష్టికి ఇక్కడ పరిస్థితులు తెలిసేలా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

## తెదేపా కీలక నేతలతో ఆదిమూలం భేటీ

సత్యవేడు, మార్చి16, ప్రభాతవార్త :

ఈసారి సార్వత్రిక ఎన్నికలకు సత్యవేడు అసెంబ్లీ స్థానంను తెదేపా అధిష్టానం ఎమ్మెల్యే ఆదిమూలంకు కేటాయించిన విషయం విధితమే. ఈనేపధ్యంలో ఆయన శనివారం మండల కీలక నేతలతో భేటీ అయ్యారు. ఈఎన్నికల్లో ఘనం విజయం సాధించేందుకు అందరి సహకారం కావాలని ఆయన కోరినట్లు తెలుస్తుంది. మాజీ యంపిపి సీనియర్ నేత మస్తాన్ యాదవ్, నటరాజ్ పిళ్ళై వారసులు తిరునీలకంఠం, పరమశివం లను వారి ఇంటి వద్ద కలిసి మాట్లాడారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎన్నికల్లో తెదేపా గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## రూ.2.08 కోట్లతో సబ్‌స్టేషన్ పూర్తి



### తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి, మార్చి 16 ప్రభాతవార్త:

తొండవాడ పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. శనివారం తొండవాడ జగనన్న కాలనీలోఆయన 5 మెగా వాట్స్ సామర్థ్యం కలిగిన 24/7 విద్యుత్ సరఫరా లక్ష్యంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేసన్‌ను ప్రారంభించారు. రూ.2.08 కోట్లతో నూతన సబ్ స్టేషన్‌ను నిర్మించినట్లు తెలిపారు.

## చంద్రగిరి కోట గ్రామంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



### బాధితుడికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ , వినాయక స్వామి ఆలయానికి మైక్ సెట్

**చంద్రగిరి, మార్చి 16 ప్రభాతవార్త:** చంద్రగిరి కోట గ్రామంలో శనివారం వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అనారోగ్యంతో భాధపడుతున్న వైసిపి కార్యకర్త కృష్ణమూర్తికి సియం రిలీఫ్ ఫండ్ నుండి రూ.2 లక్షలు చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, ఉప సర్పంచ్ నగిరి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మస్తాన్, చంద్రగిరి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి,మాజీఎంపిపి కొత్తపాటి వేణుగోపాల్ రెడ్డి, వార్డు సభ్యుడు శివ, తదితరులు పాల్గొన్నారు.

-డాక్టర్ విజయకు చెవిరెడ్డి నివాళిస్థానిక కొత్తపేటలోని డాక్టర్ సిద్దయ్య సతీమణి డాక్టర్ విజయ మృతి సమాచారం అ ందుకున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి శనివారం ఇక్కడికి చేరుకుని నివాళులర్పించారు.

## రాష్ట్రష పునర్నిర్మాణం కోసం టిడిపి కూటమిని ఆదరించండి..!

### టిడిపి నాయకురాలు ధనలక్ష్మి

**పాకాల మార్చి 16 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం తెలుగుదేశం పార్టీ కూటమిని ఆధరించాలని పులివర్తి నాని సోదరి టిడిపి నాయకురాలు ధనలక్ష్మి కోరారు. మండల పరిధిలోని గానుగపెంట పంచాయతీలో శనివారం టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నాయకులతో కలసి ఆమె బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడచిన 5 ఏళ్ళ వైసిపి పాలనలో రాష్ట్రం 20 ఏళ్ళు వెనక్కి నెట్టివేయబడిందన్నారు. టిడిపి, బిజెపి, జనసేన కూటమి అధికారం చేపట్టిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇరుగు జగన్నాధం, కార్యదర్శి సోమశేఖర్, రైతు నాయకుడు గవ్వల జగన్నాధం, బూత్ కమిటీ కన్వీనర్ నచ్చుకూరి సుధాకర్ రెడ్డి, జగన్నాధం, సీనియర్ నాయకులు బ్రహ్మయ్య ఆచ్చారి, గుర్రప్ప, నరశింహులు, తేజ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి వైకాపా అభ్యర్థి మధుసూధన్‌రెడ్డి



శ్రీకాళహస్తి, మార్చి 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవ ర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, ప్రజల సమస్యలను పరిష్కరిం చడంలో వారికి అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని వైఎస్ఆర్ పార్టీ తరపున ఎంఎల్ఏ అభ్యర్థిగా పోటీచేస్తున్న బియ్యపు మధు సూధన్‌రెడ్డి తెలిపారు. ఈసందర్బంగా బయోడేటా వివరాలు..

పేరు : బియ్యపుమధుసూధన్‌రెడ్డి,
తండ్రి పేరు : బియ్యపు గోవిందరెడ్డి
పుట్టినతేది : 15-05-1971
పుట్టిన గ్రామం : అమ్మపాళెం
సతీమణి పేరు : బియ్యపుశ్రీవాణి
పిల్లలు పేర్లు : బియ్యపు పవిత్రారెడ్డి, బి.ఆకర్షరెడ్డి
వృత్తి : రాజకీయం

## శ్రీకాళహస్తి తెలుగుదేశంపార్టీ అభ్యర్థి సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, మార్చి 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఎంఎల్ఏ అభ్యర్థిగా బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డిని అధిష్ఠానం ప్రకటించిన విషయం విదితమే, ప్రజల సమస్యలను పరిష్కరిం చడంలో వారికి అందుబాటులో ఉంటూ సేవలంది స్తానని ఆయన తెలిపారు. ఈసందర్భంగా బయోడేటా వివరాలు..

పేరు : బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి
తండ్రి పేరు : దివంగత నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి
తల్లిపేరు : బొజ్జలబృందమ్మ
పుట్టినతేది : 22-05-1979
పుట్టిన గ్రామం : ఊరందూరు గ్రామం
విద్యాభ్యాసం : ఎంబిఏ
సతీమణి పేరు : బొజ్జలరిషితారెడ్డి(బి.టెక్) ఈసిఈ
పిల్లలు పేర్లు : బొజ్జల అనికారెడ్డి (12సం.), బొజ్జల సామికారెడ్డి(8)
చెల్లెలు పేర్లు : పద్మ రేఖారెడ్డి, పజ్జూరుగంగా భవన్‌రెడ్డి
తాత : బొజ్జలగంగ సుబ్బరామిరెడ్డి, మాజీ ఎంఎల్ఏ
వృత్తి : రాజకీయం

## కుప్పం వైకాపా అభ్యర్థి ఎమ్మెల్సీ భరత్



పేరు : కృష్ణరాఘవ జయేంద్ర భరత్ (కెఆర్‌జె భరత్)
పార్టీ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.
పోటీ చేస్తున్న స్థానం : కుప్పం అసెంబ్లీ
పుట్టిన తేది : 13-11-1988(35 ఏళ్లు)
తల్లిదండ్రులు : దివంగత రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డా॥ చంద్రమౌళి, పద్మమ్మ
కుటుంబం : భార్య : దుర్గ పద్మిని, కుమార్తె.
విద్యార్హత : బి.టెక్
గతంలో:ఆఫ్రికాదేశంలోని బంగారు గనుల్లో ఉన్నతాధికారి. కర్నూలు ఎయిర్‌పోర్ట్ అథారిటీ సిఇఓగా బాధ్యతలు.
రాజకీయ ప్రవేశం : 2019 సార్వత్రిక ఎన్నికలు. 2021నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కొనసాగింపు.

## నగరి వైకాపా అభ్యర్థి ఆర్ కె రోజా



పేరు - శ్రీలత అలియాస్ ఆర్.కె.రోజా
నియోజకవర్గం - నగరి
సొంతూరు-భాకరాపేట, తిరుపతి
తల్లిదండ్రులు-నాగరాజరెడ్డి, లలిత
పుట్టిన తేదీ - 16.11.1971
విద్యార్హతలు - డిగ్రీ, పొలిటికల్ సైన్స్ భర్త పేరు - ఆర్.కె.సెల్వమణి(తమిళ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు)
సంతానం -అన్షుమాలిక, కృష్ణకౌశిక్
రాజకీయ నేపథ్యం-1999లో తెలుగుదేశం పార్టీ తరపున ప్రచారం చేయడానికి వచ్చి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు.
2004లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగాను పోటీ చేసిన ఆమె సొంత పార్టీలోని వెన్నుపోటు దారుల కారణంగా ఓటమిని చవిచూశారు.
2014లో ఆ పార్టీ తరపున నగరి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగిన ఆమె 40 ఏళ్ళ అనుభవం కలిగిన ఇద్దరు రాజకీయ నాయకులతో పోటీ పడి విజయం గెలుపొందారు.
2019 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన ఆమె ప్రతిపక్షం ఎన్నికుయుక్తులు పన్నినా చేధించి గెలుపొందారు.
2019 నుంచి 2021 వరకు ఏపీఐఐసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. న 2022, ఏప్రిల్ 11వ తేదీ నుంచి నేటి వరకు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రిగా ఉన్నారు.

## ఎన్నికల విధులకు దూరంగా వాలంటీర్లు

పాలసముద్రం, మార్చి 16 ప్రభాతవార్త: వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా వుంచాలని ఎంపిడిఓ రామనాధరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపిడిఓ రామనాధరెడ్డి మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సర్క్యులర్ అందజేశారు. ఎన్నికలు ముగిసే వరకు గ్రామ వాలంటీర్లకు ఎలాంటి పనులు చెప్పకూడదని, ఎన్నికల విధుల్లో వారు పాల్గొంటే ఎన్నికల కమీషన్ ఆదేశాలకు ఉల్లంఘించినట్లు అవుతుం దని స్పష్టం చేశారు. అలాగే పోలింగ్ ఏజెంట్లుగా వాలంటీర్లు వుండరాదని ఆయన స్పష్టం చేశారు.

## స్పష్టంగా ఎన్నికల నిబంధనలు అమలు

పాలసముద్రం, మార్చి 16 ప్రభాతవార్త: ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్ఐ భారతి పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎన్నికల్లో పాల్గొని పోటీ చేయవచ్చునని, ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని ఓటు వేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకొంటామని ఆమె స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

## నగరి నియోజకవర్గం అభ్యర్థిగా ఆర్.కె.రోజా

పుత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగరి నియోజకవర్గం అభ్యర్థిగా ఆర్.కె.రోజాకు పార్టీ టిక్కెట్ లభించింది. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రిని స్వయంగా కలిసినపుడే ఆమె అభ్యర్థిత్వం ఖరారైనా అధికారికంగా పార్టీ శనివారం ప్రకటించింది. మంత్రిగానే కాకుండా రాష్ట్ర స్థాయిలో పార్టీకి స్టార్ క్యాంపెనర్‌గా వుంటూ సేవలు అందించినప్పటికీ అసమ్మతి కారణంగా ఆమెకు టిక్కెట్ ఇవ్వడంలో పార్టీ చివరి వరకూ ఆలోచించిందనే చెప్పాలి. గతేడాది నుంచి అసమ్మతి నాయకులు రోజా వద్దు, జగన్ ముద్దు అని స్వరం పెంచారు. జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు విజయవాడలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరుల వద్ద రోజాపై తమ అసమ్మతిని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం కూడా ఆమెకు టిక్కెట్ ఇస్తే పనిచేయమని హెచ్చరించారు. ఎంత అసమ్మతి వున్నప్పటికీ అధిష్టానం రోజా అభ్యర్థిత్వం వైపే మొగ్గు చూపింది. కొన్ని రోజులుగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, భూమి పూజలతో పాటు గతంలో తన ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేసిన సేవా కార్యక్రమాల వల్ల ప్రజల్లో తనపై వ్యతిరేకత లేదని మంత్రి రోజా చెబుతూ వచ్చారు. నియోజకవర్గంలో వైసిపి క్యాడర్ అంతా తనతోనే వుందని అసమ్మతి నాయకులకు తనపై వున్న వ్యక్తిగత విభేదాలు ఎన్నికల్లో తన విజయంపై ఎటువంటి ప్రభావం చూపించవని రోజా అధిష్టానం వద్ద గట్టిగా మాట్లాడారు. అసమ్మతి నాయకుల సహాయం లేకుండానే తాను పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల్లో అఖండ విజయం సాధించానని వాదించారు. ఫలితంగా అసమ్మతిని కొట్టిపారేసి రోజాకే అధిష్టానం టిక్కెట్ ఇచ్చింది.

## చారిత్రాత్మక చంద్రగిరిలో చెవిరెడ్డి తనయుడు

**2024 వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**



చంద్రగిరి, మార్చి 16 ప్రభాతవార్త: చారిత్రాత్మక నేపథ్యం కలిగిన చంద్రగిరి (285) నియోజకవర్గంలో ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికలలో ఎంఎల్ఏ అభ్యర్థిగా బరిలో నిలిచారు. 2021 సెప్టెంబర్ 24న తిరుపతి రూరల్ మండలం, పెరుమాళ్ పల్లి-1 ఎంపిటిసిగా మొదటిసారి రాజకీయ అరంగ్రేటం చేసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మండల ఎంపిపిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. తండ్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మారిన రాజకీయ పరిణామాలతో తనదైన శైలిలో పావులుకదిపి అత్యంత ప్రతిష్టాత్మకమైన తుడా చైర్మన్ సీటులో 2023 ఆగస్టు 19న తన కుమారుడిని కూర్చోబెట్టడం ద్వారా ఒక్కసారిగా నియోజకవర్గ ప్రజలకు చేరువ చేశారు. నిత్యం నియోజకవర్గ ప్రజలతో మమేకమవుతున్న ఆయన 1998 జూన్ 29న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులకు మొదటి సంతానంగా జన్మించారు. లండన్‌లో ఎం.ఎస్ పూర్తి చేయన ఆయన తండ్రి వారసత్వాన్ని పునికిపుచ్చుకుని రాజకీయాన్ని ప్రొఫెషన్‌గా ఎంచుకున్నారు. బుక్స్ చదవడం హాబీస్ కాగా, యు.ఎస్ఏ, సింగపూర్, మలేషియా, దుబాయ్, లండన్ దేశాలను సందర్శించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఆయన చంద్రగిరి నుండి మొదటిసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎంఎల్ఏ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. 2024 సార్వత్రి ఎన్నికలలో విజయమే లక్ష్యంగా తండ్రి, తనయులు పావులు కదుపుతూ ముందుకు సాగుతున్నారు.

## గూడూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మేరిగ మురళీధర్

**సంబరాలు జరుపుకున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు**



గూడూరు, మార్చి 16, ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద నియోజక వర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మేరిగ మురళిని ప్రకటించడంతో వైసిపి నాయకులు, కార్యకర్తలు బణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్బంగా వైసిపి పార్టీ పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు మాట్లాడుతూ పార్టీకి కష్టపడి పనిచేసిన వారందరికీ తగిన గుర్తింపు ఉంటుంది అనేదానికి నిదర్శనం మేరిగ మురళి అని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ ఐదు సంవత్సరాలలో జగన్మోహన్ రెడ్డి అద్భుతమైన పాలన సాగించారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మేరిగ మురళీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గురవయ్య, నాయకులు నారాయణ రెడ్డి, సునీల్ రెడ్డి, సుభాన్, గోవర్ధన్, కృష్ణ ప్రసాద్ రెడ్డి, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలగా పదోసారి ఎమ్మెల్యేబరిలో పెద్దాయన

**-6సార్లు విజయం, 3సార్లు అపజయం**



పుంగనూరు,మార్చి 16 ప్రభాతవార్త : రాష్ట్ర సీనియర్ రాజకీయనాయకులలో మేటిగా ఉంటూ తనదైన శైలిలో ముందుకు వెడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,తన రాజకీయ జీవితంలో ఈదఫా పదోసారి రాష్ట్ర శాసనసభ్యత్వా నికి పుంగనూరు నుంచి పోటీబోయబోతున్నారు. అపజయాలు, విజయాలు, అవమానాలు,అడ్డంకులు ఎన్నెన్నోదాటుకుని ఏడు పదుల వయసులో కూడా చలాకీగా ఉంటూ ఇపుడు ఆయన పదోసారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరుపతి ఎస్వీయూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించడమే కాక,యూనివర్సిటీ చైర్మన్‌గా కూడా ఎన్నికయ్యారు. ఈనేపథ్యంలో ఆయన అప్పటి రాజకీయ గురువు మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ఆదర్శంతో రాజకీయాలలో ప్రవేశించారు. డాక్టరు కావాలనుకుని ఇంటర్మీడియెట్‌లో బైపిసి తీసుకుని,మిత్రుల ప్రోత్సాహంతో డిగ్రీలో బిఏ చదవి ఆతరువాత ఎంఏ ఇంగ్లీష్ లిటరేచర్ చదవిన పెద్దిరెడ్డి,పిహెచ్‌డి సాధించారు. ఆ తరువాత ఆయన 1978లో జనతా పార్టీనుంచి పీలేరు అభ్యర్థిగా పోటీచేసి ఇండియన్ కాంగ్రెస్ అభ్యర్థి మొగల్‌సైఫుల్లా బేగ్‌చేతిలో, 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి, తెలుగుదేశం అభ్యర్థి చల్లా ప్రభాకర్ రెడ్డితో ఓడిపోయారు. 1989లో పీలేరులో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి చల్లారామచంద్రారెడ్డి పై విజయం సాధించారు. మరోసాఇ ఆయన 1994లో తెలుగుదేశం అభ్యర్థి జి.వి శ్రీనాథరెడ్డిచేతిలో ఓటమిపాలయ్యారు. పుంగనూరు కాంగ్రెస్ అభ్యర్థిగా 2009,2014,లలో విజయాలు సాధించారు.2019 లో వైకాపా అభ్యర్థిగా ఘనవిజం సాధించారు. విజయ పరంపరలు మొదలైన తరువాత నుంచి ఆయన ప్రతి ఎన్నికలలో అనూహ్యమైన మెజార్టీ సాధిస్తూ పుంగనూరులో కంచుకోటగా ఉన్న తెలుగుదేశం ఆనవాలు లేకుండా చేయడంలో సఫలమయ్యారు. పార్టీలో రాష్ట్రంలో రెండో స్థానంలో ఉంటూ రాష్ట్ర,జిల్లా రాజకీయాలలో విశేషమైన పట్టు సాధించిన తరుణంలో పెద్దాయనగా పిలువబడు తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శాసనసభ్యత్వానికి ఇది పదో పరీక్ష. తాను సాధించిన ఆపార అభిమానం,పార్టీలో సీనియారిటీ వెరసి ఈదఫా ఎన్నికలు ఆయన ఖ్యాతికి గీటురాయిగా నిలబడనున్నాయి.

## వైసిపి అభ్యర్థిగా నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి



వెంకటగిరి టౌన్, మార్చి 16, ప్రభాతవార్త : వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పేరు ఖరారు చేస్తూ సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు. ఆయన ఇంజనీరింగ్ వరకు చదివారు. మాజీ సిఎం జనార్దన్ రెడ్డి మాజీ మంత్రి రాజ్యలక్ష్మి తనయుడు 2014 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాంకుమార్ రెడ్డి పోటీ చేశారు. నియోజకవర్గ ఆయన 76 వేల గృహాలకు వెళ్లి ఆయన సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర కమ్యూనిటీ బోర్డ్ డెవలప్మెంట్ చైర్మన్‌గా, వైసిపి జిల్లా అధ్యక్షులుగా, నియోజకవర్గ సమన్వయకర్తగా రాంకుమార్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేస్తానని చెప్పారు. అభ్యర్థిగా రామకుమార్ రెడ్డి పేరు ప్రకటించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచ పేల్చి సంబరాలు నిర్వహించారు.

## జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ జట్టుకు వెదురుకుప్పం క్రీడాకారిణి ఎంపిక

వెదురుకుప్పం, మార్చి 16 ప్రభాతవార్త : జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ జట్టుకు వెదురుకుప్పం ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడకారిణి ఉమా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఇటీవల అనంతపురం జిల్లా ఆర్‌డిటి స్టేడియంలో నిర్వహించిన సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి చిత్తూరు జిల్లా నుంచి జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక కావడం జరిగిందన్నారు. పాఠశాలలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎంపికైన క్రీడకారిణి ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 3 వరకు మహారాష్ట్ర ఔరంగాబాద్ పట్టణంలో జరగబోవు జాతీయ స్థాయి క్రీడ పోటీలలో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా క్రీడకారిణి ఉమా, ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌ను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

## కాణిపాకంలో ప్రోటోకాల్ దర్శనాలు రద్దు

కాణిపాకం, మార్చి 16 ప్రభాతవార్త: ఎన్నికల కోడ్ నేపథ్యంలో కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ప్రోటోకాల్ దర్శనాలను పూర్తిగా రద్దు చేసినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. దేశంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా శనివారం సాయంత్రం 3 గంటల నుండి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో నేటి నుండి జూన్ 6 వరకు ఆలయంలో ప్రోటోకాల్ దర్శనాలను పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు.ఇకపై ప్రతి ఒక్కరూ రూ.100, రూ.150లు దర్శన క్యూలైన్లులో వెళ్ళి దర్శనం చేసుకోవాల్సి వుంటుందని తెలిపారు. అలాగే ఆలయం వద్ద వున్న వివిపీ గేట్, పీఆర్ఓ కార్యాలయంను పూర్తిగా మూసివేస్తున్నట్లు ఈఓ వెంకటేశు తెలిపారు.

## పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సదుం, మార్చి16ప్రభాతవార్త : మండల పరిధిలో ఈనెల 18 నుంచి నిర్వహించనున్న 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ డిఈఓ శ్రీరామ పురుషోత్తం అన్నారు. శనివారం ఆయన సదుంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి జరగబోవు పది పరీక్షల నిర్వహణలో భాగంగా పాఠశాలలో విద్యుత్తు , మంచినీరు, డెస్కులు మొదలైన సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలని చీఫ్,డిపార్టుమెంటల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయ కుమార్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు శ్రీరాములు, దామోదర, జిల్లా ఏఎల్ఎస్ఓ అజయ్‌కుమార్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు మోహన్‌కుమార్‌రెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన జేసీను కలిసిన కమిషనర్ అధితి సింగ్



తిరుపతి కార్పొరేషన్, మార్చి 16, ప్రభాతవార్త : తిరుపతి జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ధ్యాన్ చంద్రని నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందజేసారు.

## ఏడు వారాల నగలు బ్యాంకులో డిపాజిట్



శ్రీకాళహస్తి,మార్చి 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ఆలయంలోని స్వామి అమ్మవార్లకు నాటి రాజులు తయారు చేయించి విలువ కట్టలేని ఏడు వారాల నగలను శనివారం ఆలయాధికారులు బ్యాంకులో డిపాజిట్ చేసారు. నాడు రాజులు స్వామి అమ్మవార్లకు 143 రకాల నగలను అలంకారాలకు తయారు చేయించారు.వాటిని అధికారులు భద్రత దృష్ట్యా బ్యాంకు లాకర్లో భద్రపరచి ఉన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో అలంకరణలకు తీసుకోవటం మళ్ళి బ్యాంకులో డిపాజిట్ చేయటం జరుగుతుంది.ఈ నేపథ్యంలో ఈ ఏడాది మహాశివరాత్రికి బయటకు తీసిన నగలను శనివారం మళ్ళీ భద్రపరచారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ ఎస్ వి నాగేశ్వరరావు, ఎసి మల్లికార్జున్ ప్రసాద్,అలంకార గురుకుల్స్ రాజేష్, సూరి, అకౌంటెంట్ యుగంధర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకోడ్‌ను రాజకీయ పక్షాలు ఉల్లంఘించరాదు

**- కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు**



కుప్పం, మార్చి 16 ప్రభాతవార్త : ఎన్నికల కోడ్‌ను రాజకీయ పక్షాలు ఉల్లంఘించకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పక్షాలు సహకరించాలని కుప్పం ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శనివారం కుప్పం తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పక్షాలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోడ్ అమల్లో వచ్చిన నేపథ్యంలో రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయడం, పార్టీల జెండాలు, హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు తొలగించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం రాజకీయ నాయకుల ఫోటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ హరికుమార్, సిఐలు రమణ, ఈశ్వర్‌రెడ్డి, రాజకీయ పక్షాల నేతలు పిఎస్ మునిరత్నం, శివశంకర్, మురుగేష్, నరేష్, కేశవరాజులు, డా॥ వెంకటేష్, కన్నన్, డిటి రెడ్డెప్ప, ఎంపిడిఓ ఖాదర్ బాషా, ఇఓపిఆర్‌డి చిన్నరెడ్డెయ్య, మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను సీఎంగా చేసుకోవాలి

కోట, మార్చి 16 ప్రభాతవార్త : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాల్సిన అవసరం ఉందని గూడూరు సమన్వయకర్త, ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ అన్నారు. శనివారం కోటలో వైఎస్సార్ చేయూత పథకానికి సంబంధించిన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 2వేల మందికి రాష్ట్ర వైసీపీ సెక్రటరి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రటరీ నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, ఎంపిపి దాసరి అంజమ్మ, జడ్పిటిసి కోటయ్య, చెందోడు సర్పంచ్ దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, చిట్టేడు సొసైటీ మాజీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, గురుస్వామి, సిద్ధవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, సిద్ధవరం సొసైటీ ఛైర్మన్ పాదర్తి రాధాకృష్ణారెడ్డి, చిట్టేడు మాజీ సర్పంచ్ రఘురామయ్య, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, దువ్వూరు వెంకటరమణారెడ్డి, మొబిన్‌బాషా, సర్పంచ్ వెంకటరమణమ్మ, జిల్లా మహిళా జాయింట్ సెక్రటరీ సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వడమాలపేట, మార్చి 16 ప్రభాతవార్త: బహుజన సేవా సంఘం నాయకులు మండలంలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే సామగ్రి శనివారం వితరణగా అందజేశారు. మండలంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లోని 145 మందికి, సీతారామపురం హైస్కూలు 21 మందికి, శ్రీ బొమ్మరాజపురం హైస్కూలు 24 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, స్కేల్స్‌లను ఎంఈవోలు పద్మావతి, తులసిరామ్‌ల ద్వారా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దిలీప్, ప్రధానోపాధ్యాయులు కరుణ నవనీతం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ధనంజయులు, నాయకులు భానుప్రకాష్, వెంకటేష్, మునస్వామి, మునెయ్య, సాయి, వినయ్‌లు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో మార్పు రావాలి - బోడే రామచంద్ర యాదవ్



రేణిగుంట, మార్చి 16 ప్రభాతవార్త: చేయాల్సింది పోరాటాలు కాదని రాజకీయాల్లో మార్పు తీసుకురావాలని భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ అన్నారు. రేణిగుంట పాత చెక్‌పోస్టు సమీపంలోని కల్యాణ మండపంలో శనివారం భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో భావితరాల ధర్మ పోరాట సభ జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సభకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఫోక్ సింగర్ మధుప్రియ పార్టీ, పార్టీ అధ్యక్షునిపై పాడిన పాట అందరిని ఉత్సాహపరచింది. సందర్భంగా బోడే రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ వైసీపీ, టీడీపీలపై విమర్శ శాస్త్రాలు సంధించారు. రాష్ట్ర ప్రజలకు టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు చేసిందేమీ లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు పేరు చెప్పి దాదాపు లక్షకోట్ల రూపాయలు రెండు పార్టీలు దోచేశాయన్నారు. సమావేశంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ బీసీవై అభ్యర్థి దీనాద్ బాబు, సునీల్, రమేష్, త్యాగరాజు, శ్రీనివాసులు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఆరాధ్య రాముల వారికి ఆలయ ఉద్యోగులు, భక్తులు వెండి వితరణ

**2.7 కేజీలు రూ.2.65 లక్షలతో లక్ష్మీ కాసుల హారం కానుక**



చంద్రగిరి, మార్చి 16 ప్రభాతవార్త: తమ ఆరాధ్యదైవమైన శ్రీకోదండరామ స్వాముల వారికి ఆలయ ఉద్యోగులు, భక్తులు వెండి హారం వితరణ చేశారు. స్థానిక శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో పనిచేస్తున్న టిటిడి ఉద్యోగులు భగవంతుడికి తమ వంతుగా కానుక అందజేయాలని భావించి తమకు తోచిన రీతిలో నగదును కూడబెడుతున్న క్రమంలో కొంత మంది భక్తులు సైతం తమవంతుగా కొంత మొత్తాన్ని అందజేశారు. ఆ మేరకు కూడబెట్టిన మొత్తంతో 2.725 కేజీలు బరువుతో రూ.2.65 లక్షల విలువైన వెండి లక్ష్మీ హారాన్ని తయారు చేయించి శనివారం ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ముని హరిబాబు, ఆలయ అర్చకులు శ్రీనివాస భట్టర్, మోహన్‌కు ఆలయ సిబ్బంది సిబ్బంది దేశయ్య, భక్తులు అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం వెండి లక్ష్మీ హారాన్ని స్వామి వారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## టిడిపి రాజకీయ ప్రస్థానం..టిడిపితోనే ముగింపు : ఎస్‌సివి



శ్రీకాళహస్తి,మార్చి 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీతోనే తాను రాజకీయ రంగ ప్రవేశం చేసానని ఆ పార్టీలోనే నిష్క్రమిస్తానని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు స్పష్టం చేసారు. శనివారం శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఎస్‌సివి నాయుడును కలిశారు.ఈ సందర్భంగా వారు అంతర్గతంగా కొంత సేపు చర్చించుకున్నారు. ఈ చర్చల్లో ఎస్‌సివి నాయుడు స్పష్టంగా తాను ఆది నుంచి తెలుగుదేశం పార్టీలోనే ఉన్నానన్నారు.

**చంద్రబాబును సిఎం చేయటమే లక్ష్యం:**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌సివి మాట్లాడుతూ పార్టీని విజయపథంలో నడిపి రాబోవు ఎన్నికల్లో విజయం సాధించి నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయటమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అయితే ఎన్నికల ముందు అందరిలానే తాను పార్టీ టిక్కెట్టు ఆశించానని కానీ అభ్యర్థిని ప్రకటించే ముందు మా పరిస్థితి ఏమిటని పార్టీ అధ్యక్షుడు కానీ, యువనాయకుడు కానీ చర్చించి ఉంటే బాగుండేదన్నారు. ప్రధాని సభ తరువాత నాయకులతో చర్చిస్తామన్నారు. తనపై వస్తున్న అసత్య ఆరోపణలు సరి కాదన్నారు.ప్రలోభాలకు లొంగే నాయకుడు ఎస్‌సివి కాదని స్పష్టం చేసారు.

**ఎస్‌సివి ప్రాధాన్యతను గుర్తించాలి: సుధీర్‌రెడ్డి**

శ్రీకాళహస్తి నియోజకవర్గంతో పాటు సత్యవేడు,సూళూరుపేట,వెంకటగిరి, తిరుపతి రూరల్‌లో ఎంతో గుర్తింపు ఓట్లు సాధించగల సత్తా ఉన్న మాజీ ఎంఎల్ఏ ఎస్‌సివి నాయుడు ప్రాధాన్యతను గుర్తించాల్సి ఉందని తెలుగుదేశం అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్రమోదీ పర్యటన తరువాత తాను ఎస్‌సివి అన్న పార్టీ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు, ప్రధానకార్యదర్శి నారాలోకేష్‌తో కలసి చర్చిస్తామని ఎస్‌సివి అన్నకు ఎంఎల్‌సి పదవి ఇప్పించటానికి తాను కూడా కృషి చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి, చెలికంపాపిరెడ్డి, స్కిట్ మాజీ ఛైర్మన్ వంజావాకం గురుధశరధన్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, సత్రవాడ ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్,కిషోర్, మునిరాజనాయుడు, ధనంజయులునాయుడు తదితరులు పాల్గొన్నారు.



## రాత్రి సేద తీర్చటానికి రూ.45లక్షలతో షెడ్డు ఏర్పాటు

శ్రీకాళహస్తి,మార్చి 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతి రోజూ వచ్చే వేలాది మంది భక్తులకు రాత్రి కునుకు తీయటానికి రూ.45లక్షలతో నిర్మించిన షెడ్డును శనివారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. ఎన్నికల షెడ్డులు ప్రకటనకు మూడు గంటల ముందు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. బహుశా ఇదే చివరి ప్రారంభోత్సవం. శ్రీకాళహస్తీశ్వ రుని దర్శనానికిప్రతి రోజూ వేలాదిమంది భక్తులు వస్తున్నారు. వారు రాత్రి బస చేయటానికి, అలాగే కునుకు తీయటా నికి స్థానిక లాడ్జిలు నిలువుదోపిడి చేస్తున్నారనే విమర్శ లతో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాస్టర్‌ప్లాన్‌కు ముందు పాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భవనం ఉన్న స్థలంలో షెడ్డును నిర్మించారు. చైర్మెన్‌తో ఆలయ ఇఓ నాగేశ్వరరావు పాటు ధర్మకర్తల మండలి సభ్యులు కొండుగారి కృష్ణకుమార్, శ్రీనివాసులు, ప్రత్యేక ఆహ్వా నితులు చింతామణి పాండు కంఠా ఉదయ్‌కుమార్, సూరాగారి సురేష్, ఇంజనీరింగ్ శాఖకు చెందిన ఇఇ నూకారత్నం,డిఇ శ్రీనివాసులురెడ్డి, ఏఇఇ శివకిషోర్, బాలాజి,ప్రతాప్ దేవస్థానం ఉద్యోగులు సుదర్శనం రెడ్డి,కామేశ్వరరావు,ఉప్పు కృష్ణయ్య, శ్రవన్ కుమార్, రాజా,బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


**శ్రీ మూలస్థాన ఎల్లమ్మ దేవాలయం**
**చంద్రగిరి (గ్రా,మం), తిరుపతి జిల్లా**
**e-procurement Tender NIT**
**No.P/COE/517/2024, Dt:14/03/2024**
ఉపాలయాలు మరియు నవగ్రహ మండపం పునఃనిర్మాణము కొరకు ఇ-ప్రోక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కొరడమైనది. వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : పుట్టా రామకృష్ణారెడ్డి, కార్యనిర్వహణాధికారి

**SRIKALAHASTI MUNICIPALITY**
**'e' PROCUREMENT- Tender NOTICE**
**Commissioner, Srikalahasti Municipality**
has invited tenders for the **8 works** with **Rs.79.15 lakhs** vide
**Tender Notice**
**NIT No.24, 28, 30, 31,33 to 36/2023-24 Dated: 15.03.2024 .**
The Municipal Commissioner is empowered either cancellation/ postpone/ modification of the Tenders, Further Details can be seen at Office Notice Board and 'e'Procurement Market place @ http:// tender.apeprocurement.gov.in
**Sd/- B.Balaji Naik, Commissioner, Srikalahasti Municipality**